Published by Telangana
TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 154 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శుక్రవారం 13-06-2025 పేజీలు :12 వెల :2/-

విలేఖర్లు కావలెను



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లో
జిల్లాలు,నియెజకవర్గాలు
మండలాల వారీగా
" సత్యమేవ జయతే "
తెలుగు దినపత్రికకు
రిపోర్టర్లు కావలెను
ఆసక్తి ఉన్నవారు ఈ నెంబర్ కి సంప్రదించగలరు
J.BHASKER
Managing Director
PH ; 9398191920
P.AARYA NAYAK
Joint MBNR District Bureau
PH ; 9281116767
SHADNAGAR

## కాంగ్రెస్ చెప్పిన 'మార్పు' ఇదేనా?: హరీశ్ రావు

- గ్రామ పంచాయతీలకు 16 నెలలుగా నిధులు అందడం లేదన్న హరీశ్ రావు
- నిధుల కేటాయింపుల్లో ప్రభుత్వం విఫలమయిందని మండిపాటు
- బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసిందని వ్యాఖ్య



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత కొంతకాలంగా పంచాయతీలకు నిధులు అందడం లేదని, దీంతో క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు గత 16 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కావడం లేదని హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. నిధుల కొరత కారణంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను నడిపేందుకు కూడా డీజిల్ లేని దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలను ఉన్నతాధికారులకు అప్పగించేస్తున్నారని

మిగతా 2లో

## ప్రధాని పదకొండేళ్లలో వినూత్న మార్పులు:ఎంపి ఈటల రాజేందర్



**హైదరాబాద్:** ప్రధాని నరేంద్రమోదీ పదకొండేళ్ళ పాలనలో దేశానికి గొప్పమార్పులను తీసుకువచ్చిందని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ తెలిపారు. ప్రదాని మోదీ పదకొండేళ్ల పాలన పూర్తి అయిన సందర్భంగా గురువారం శామీర్‌పేట్ ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపి ఈటల మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ 11 ఏళ్ల పరిపాలనలో జాతీయరహదారుల నిర్మాణం, రైల్వే, కొత్త విమానాశ్రయాలు ఏర్పాట్లు, నిరుద్యోగ పరిష్కారం, రక్షణ రంగం ఉత్పత్తులు పెంచడం లాంటి ఎన్నో విప్లవాత్మకమార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రదాని నరేంద్రమోదీ అమలు కాని హామీలు ఇవ్వలేదని, మొదటి ఐదేళ్ల పాలనచూసి ఓట్లువేసి ఆశీర్వదించాలని మాత్రమే కోరారని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అన్ని మిత్రదేశాలతో సత్సంబంధం నెలకొల్పడంలో, భారతదేశం యొక్క గొప్పతనాన్ని ప్రపంచనికి తెలియజేయటంలో ప్రదాని మోదీ నిర్వహించిన పాత్ర ఎంతో గొప్పదన్నారు.



# విమానంలో ఉన్న 241 మంది మృతి..!

## గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా..

**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం సంభవించిన భయంకరమైన విమాన ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిపోయింది. ప్రయాణికులు, సిబ్బందితో పాటు, హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు కూడా మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఘోర విమాన ప్రమాదంలో అందులో 241 మంది చనిపోయినట్లు అహ్మదాబాద్ సీపీ తెలిపారు. మృతుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రుపానీ కూడా మరణించినట్లు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు.



విమానంలో ఉన్న 229 ప్రయాణికులు, ఇద్దరు పైలెట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బంది చనిపోయినట్లు అధికారులు స్పష్టం చేశారు. విమానంలో మొత్తం 230 ప్రయాణికులు ఉండగా విశ్వస్ కుమార్ రమేష్ అనే ఒకే ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. విమానంలో ఉన్న వాళ్లు మాత్రమే కాకుండా.. విమానం కూసిన బిల్డింగ్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న మెడికల్ విద్యార్థులు కూడా మృతి చెందారు. వారు ఎంత మంది చనిపోయారనే విషయం ఇంకా వెల్లడించలేదు. ఇంత ఘోర ప్రమాదంతో యావత్ దేశం ప్రస్తుతం శోకసంద్రంలో మునిగిపోయింది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలిపోయింది. లండన్‌కు వెళ్తున్న విమానం నగరంలోని మేఘాని ప్రాంతంలోని ఓ మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిపోయింది. ఆ సమయంలో

మిగతా 2లో



## చార్మినార్, ఫలక్‌నుమా వద్ద మెట్రో పనులకు బ్రేక్:

## హైకోర్టు కీలక ఆదేశాలు!

- హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులకు హైకోర్టు తాత్కాలిక బ్రేక్
- చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ దగ్గర పనులు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు
- వారసత్వ కట్టడాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ పిల్ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ వరకు నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం
- యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెట్రో రైలు రెండో దశ పనులకు వారసత్వ కట్టడాల వద్ద అవరోధం ఎదురైంది. చారిత్రక చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో ఎలాంటి మెట్రో నిర్మాణ పనులు చేపట్టరాదని తెలంగాణ హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశలో భాగంగా కారిడార్-6 పనులను వారసత్వ కట్టడాల పరిరక్షణకు సంబంధించి ఎలాంటి అధ్యయనం చేపట్టకుండానే ప్రారంభిస్తున్నారని యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్

మిగతా 2లో

## యూకే పర్యటనలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని యూనస్‌కు చేదు అనుభవం

- యూకే పర్యటనలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని మహమ్మద్ యూనస్‌కు నిరాశ
- బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో భేటీ అయ్యేందుకు యూనస్ చేసిన ప్రయత్నాలు విఫలం
- బ్రిటన్ రాజు మూడో చార్లెస్‌తోనూ కుదరని సమావేశం
- బంగ్లాదేశ్ నుంచి తరలించిన నిధులను వెనక్కి తెప్పించడంలో సాయం చేయాలని యూకేకు విజ్ఞప్తి



2



2లో

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- హైదరాబాద్‌లో గురువారం రాత్రి భారీ వర్షం
- ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన
- లోతట్టు ప్రాంతాలు నీట మునక, రోడ్లపై వరద
- ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల అవస్థలు
- రాష్ట్రంలో మరో ఐదు రోజులు వర్షాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడి
- చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావం

## సుపరిపాలనలో మొదటి అడుగు... నేటి నుంచి కీలక హామీ అమలు: సీఎం చంద్రబాబు

- 67.27 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం అమలు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వం కన్నా 24.65 లక్షల మంది విద్యార్థులకు అదనంగా లబ్ధి
- పథకం కోసం రూ.10,091 కోట్లు, పాఠశాలల అభివృద్ధికి రూ.1,346 కోట్లు కేటాయింపు



2



## పర్యావరణ పరిరక్షణకు కొత్త పాలసీ తెచ్చాం: శ్రీధర్ బాబు

**హైదరాబాద్:** పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి శ్రీధర్‌బాబు ) సూచించారు. భూతాపం పెరగకుండా చూడాలని అన్నారు. సిఐఐ, గ్రీన్ కో ఆధ్వర్యంలో ' గ్రీన్ కో ' సమ్మిట్ ను ప్రారంభించారు. 'గ్రీన్ కో' సమ్మిట్‌కు ముఖ్య అతిధిగా శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2025 జూన్ 12, 13 తేదీలలో హైదరాబాద్‌లో గ్రీన్ కో' సమ్మిట్ జరుగుతుందని, ఈ సమ్మిట్ సుస్థిరత, గ్రీన్ టెక్నాలజీ, బాధ్యతాయుత వ్యాపార పద్ధతులకు అంకితం చేయబడిందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు కొత్త పాలసీ తెచ్చామని అన్నారు. సాంకేతికతతో కాలుష్యాన్ని తగ్గించేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# విమానంలో ఉన్న 241 మంది మృతి..!

భారీ పేలుడు సంభవించింది. గాల్లోకి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (%ణ+జూ%) ప్రకారం.. విమానంలో 242 మంది ఉన్నారు. అందులో 230 మంది ప్రయాణికులు, 2 పైలట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బంది ఉన్నారు. విమానం కెప్టెన్ సుమీత్ సభర్వాల్, ఫస్ట్ ఆఫీసర్ క్లైవ్ కుందర్ ఆధ్వర్యంలో ఉంది.

**గుజరాత్ విమాన ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. 242 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొంత సమయానికే కుప్పకూలిపోయింది. అయితే ఈ ప్రమాదంపై దేశ వ్యాప్తంగా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్రంగా కలచి వేసింది. ఇది హృదయ విదారకర ఘటన. మాటలు రావట్లేదు.

**ఈ క్లిష్ట పరిస్థితుల్లో దేశం మొత్తం బాధితులకు తోడుగా ఉంటుంది": రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

"అహ్మదాబాద్ విమాన ప్రమాదం విని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇది మాటలకందని విషాదం. ఈ విపత్కర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలను నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నా": ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఘటనస్థలికి వెళ్లారు. ప్రధాని మోదీ రామ్మోహన్ నాయుడుతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యల వేగవంతం చేయాలని.. ఎప్పటికప్పుడు వివరాలను తనకు అప్‌డేట్ చేయాలని కేంద్ర మంత్రిని ప్రధాని ఆదేశించారు.

**హాస్టల్ ప్రాంగణంలో 25 మంది బలి**

మధ్యాహ్నం ఎయిర్‌పోర్టుకు సమీపంలోని బిజె మెడికల్ కాలేజీ (బిజెఎంసి) హాస్టల్‌లో విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు.ఈ లోగానే విమానం వీరి హాస్టల్ క్యాంటిన్ వైపు దూసుకువచ్చింది. భీకరమైన శబ్ధం తరువాత క్షణాల్లోనే విమానం మీదపడటంతో విద్యార్థులలో దాదాపు పాతిక మంది మంటలు అంటుకుని మృతి చెందారు. డైనింగ్ టేబుల్ పై ప్లేట్లలో ఆహారం ,వీటిపైనే పడి ఉన్న కాలిన మృతదేహాలతో ఇక్కడ విషాదకర వాతావరణం నెలకొంది. విద్యార్థులలో నలుగురు ఎంబిబిఎస్ చేస్తున్నారు. ఒక్కరు పిజి విద్యార్థి . శిథిలమైన భవనంలో ప్లేట్లలో వడ్డించుకుని ఉన్న అన్నం సగం తినితినకుండా విద్యార్థులు విగత జీవులు అయ్యారు. హాస్టల్ క్యాంటిన్ అంతా చెల్లాచెదరైన ప్లేట్లతో మంచినీటి గ్లాసులతో రణరంగంగా మారింది. విమానంలోని ఓ శకలం హాస్టల్‌లో ఓ భాగంలో పడి ఉంది. ఈ ఘటనపై ఫైమా డాక్టర్ల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు మృతి చెందారు. పలువురికి గాయాలు అయ్యాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది.

**ఎటువంటి సాయం చేయడానికి అయినా సిద్ధం అని ప్రకటించారు.**

ఘటనలో 40 మంది వరకూ డాక్టర్లు గాయపడ్డారు. ఒక్క డాక్టరు పరిస్థితి విషమంగా ఉంది. ఘటన సమయంలో తన కుమారుడు హాస్టల్ క్యాంటిన్‌లో ఉన్నాడని, విమానం కూలుతున్నది గుర్తించి వెంటనే రెండో అంతస్తు నుంచి కిందకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడని విద్యార్థి తల్లి రామ్‌లీలా తెలిపారు. విమానం దూసుకువస్తున్న వైనం సకాలంలో గుర్తించి చాలా మంది పరుగులు తీయడం , కిందికి దూకడంతో వారి ప్రాణాలు దక్కాయని ఆమె వివరించారు. తన కుమారుడు ఇప్పుడు క్షేమంగా ఉన్నాడని చెప్పింది. ఆయనతో తాను ఫోన్‌లో మాట్లాడానని వివరించారు. రెండో అంతస్తు నుంచి దూకడంతో గాయాలు అయ్యాయని వివరించారు. కాగా ఘటనలో 30 నుంచి 40 మంది వరకూ జూనియర్ డాక్టర్లు గాయపడ్డారు. వీరిలో ఒక్కరిద్దరి పరిస్థితి విషమంగా ఉందని ప్రత్యక్ష సాక్షి అయిన డాక్టర్ శ్యామ్ గోవింద్ వార్తా సంస్థలకు తెలిపారు.

**మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు !**

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరంలో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా విమానం వైద్య విద్యార్థుల హాస్టల్ పై కూలిపోయింది. ఈ ప్రమాదంలో 200మందికిపైగా మృత్యువాత పడగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదం అనంతరం మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో, వారి గుర్తింపుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని గుజరాత్ ఆరోగ్యశాఖ కార్యదర్శి ధనంజయ్ ద్వివేది తెలిపారు. బి.జె. మెడికల్ కళాశాల ఆసుపత్రిలో ఈ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.మృతుల కుటుంబసభ్యులు, ముఖ్యంగా తల్లిదండ్రులు లేదా పిల్లలు డీఎన్ఏ నమూనాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా మరణించినవారిని త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని వివరించారు.

గాయపడిన 50 మందిని అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ, స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు ఇప్పటికే 25 మంది గాయపడిన వారి పేర్లను విడుదల చేశారు.ప్రమాదం అనంతరం అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో హృదయ విదారక దృశ్యాలు చోటుచేసుకున్నాయి. ఇటువంటి సామూహిక ప్రాణనష్టం తాము ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

ప్రమాదం తర్వాత ఆస్పత్రిలో పరిస్థితి గందరగోళంగానూ, హృదయ విదారకంగానూ మారిందన్నారు. తీవ్రమైన గాయాలతో బాధపడుతూ అనేక మంది బాధితులు విలపిస్తూ రోదించడమే కాక, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వెలుపల గుమిగూడి ఆందోళన వ్యక్తం చేశారు. క్షతగాత్రులను ఒకరి తర్వాత ఒకరు అత్యవసర వార్డులకు తరలిస్తున్నారని, పరిస్థితి భయంకరంగా ఉందని, తీవ్ర గాయాల కారణంగా అనేక మంది రోదనలు, హాహా కారాలతో భయానక పరిస్థితి నెలకొందని చెప్పారు.

**అమిత్ షా పర్యటన !**

ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఆయన వెంటనే అహ్మదాబాద్ కు వెళ్లి అక్కడ బి.జె. మెడికల్ కాలేజీ ఆసుపత్రిని సందర్శించి, చికిత్స పొందుతున్న గాయపడిన వారిని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా కేంద్రం మద్దతుగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. విమాన ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం అధికారం కలిగిన ఏజెన్సీలతో కూడిన సమగ్ర విచారణకు ఆదేశించింది.

**విమాన ప్రమాదం.. భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన టాటా గ్రూప్!**

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కూలిపోయింది. 241 మంది ప్రయాణికులు, సిబ్బంది మరణించారు. ఎయిర్ ఇండియా మాతృ సంస్థ టాటా గ్రూప్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

**విమాన ప్రమాదం.. భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన టాటా గ్రూప్!**

యావత్ దేశం ఉలిక్కిపడేలా ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలిపోయింది. లండన్‌కు వెళ్తున్న విమానం నగరంలోని మేఘాని ప్రాంతంలోని ఓ మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిపోయింది. ఆ సమయంలో భారీ పేలుడు సంభవించింది.

**గాల్లోకి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి.**

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ప్రకారం.. విమానంలో 241 మంది ఉన్నారు. అందులో 230 మంది ప్రయాణికులు, 2 పైలట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బంది ఉన్నారు. విమానం కెప్టెన్ సుమీత్ సభర్వాల్, ఫస్ట్ ఆఫీసర్ క్లైవ్ కుందర్ ఆధ్వర్యంలో ఉంది. కాగా ఈ ప్రమాదంలో మరణించిన వారికి టాటా గ్రూప్ భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం ఇవ్వనున్నట్లు టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. అలాగే విమాన ప్రమాద సమయంలో దెబ్బ తిన్న మెడికల్ కాలేజీ బిల్డింగ్ ను కూడా పునర్నిర్మిస్తామని కూడా తెలిపారు.

# సుపరిపాలనలో మొదటి అడుగు...

# నేటి నుంచి కీలక హామీ అమలు: సీఎం చంద్రబాబు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా సుపరిపాలనలో తొలి అడుగు వేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేటి నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం' పథకం ఇస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారంతో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ హామీని నెరవేరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒక కీలకమైన పథకమని పేర్కొన్నారు.

**67 లక్షల మంది పిల్లలకు లబ్ధి...**

'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 67.27 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని, ఇందుకోసం మొత్తం రూ.10,091 కోట్లు ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ నిధుల్లో రూ.1,346 కోట్లను పాఠశాలల అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోని అమ్మఒడి పథకంతో పోల్చినప్పుడు, తమ ప్రభుత్వం అందిస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ప్రభుత్వం కేవలం 42,61,965 మంది విద్యార్థులకే అమ్మఒడి పథకం అందించింది. మా ప్రభుత్వం 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. అంటే, గత ప్రభుత్వం కంటే 24,65,199 మంది విద్యార్థులకు అదనంగా సాయం అందిస్తున్నాం. వారు రూ.5,540 కోట్లు ఇస్తే, మేం రూ.8,745 కోట్లను నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. వారికంటే రూ.3,205 కోట్లు అదనంగా కేటాయిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**1వ తరగతి నుంచి ఇంటర్ వరకు..!**

ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులను కూడా ఈ పథకం కింద పరిగణనలోకి తీసుకున్నామని, పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే వారికి కూడా నిధులు జమచేస్తామని హామీ ఇచ్చారు. తల్లి లేని పిల్లలకు తండ్రి లేదా సంరక్షకుల ఖాతాల్లో, అనాథ పిల్లల విషయంలో జిల్లా కలెక్టర్ నిర్దేశించిన వారికి నగదు జమ చేస్తామని తెలిపారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 76 వేల మంది విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. పారదర్శకత కోసం లబ్ధిదారుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామని, సాంకేతిక కారణాలతో ఎవరికైనా సమస్య తలెత్తితే ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 30న తుది జాబితా ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో బలహీన వర్గాలకే పెద్దపీట వేశామని, జనాభా సమతుల్యతలో ఇది ఒక ముందడుగు అని సీఎం అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని, సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచి, దాన్ని అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని చంద్రబాబు అన్నారు. విద్యారంగమైన రాష్ట్రాన్ని బాగుచేస్తామని, కష్టాలు వచ్చినప్పుడు వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇతర సంక్షేమ పథకాల అమలుపైనా ఆయన ప్రస్తావించారు.

# ఒంటరి వృద్ధులకు రక్షణేదీ?

**- వృద్ధులపై దారుణాలు.. - బిక్కుబిక్కుమంటున్న పండుటాకులు - హైదరాబాద్‌లో వృద్ధుల రక్షణపై కలవరం**

వృద్ధులపై జరుగుతున్న దారుణాలతో వారు ఒంటరిగా ఇండ్లలో ఉండాలంటేనే బిక్కు బిక్కుమంటూ భయంతో గడపాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. నగరం నడిబొడ్డున, నగర శివార్లలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో వృద్ధులకు రక్షణ లేకుండాపోతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో చాలా మంది ఒంటరి వృద్ధులు ఉంటారు. పిల్లలు ఉద్యోగాల నిమిత్తం విదేశాలు, స్వదేశంలో ఉండడం, చాలా మంది ఒంటరిగానే ఉంటున్నారు. అసలే వారికి ఆరోగ్య పరమైన ఇబ్బందులతో ఆందోళనల్లో ఉంటుంటారు. అలాంటి వారిని అక్కున చేర్చుకోవాల్సిన సమాజంలోని కొందరు నేర స్వభావం కలిగిన వాళ్లు వారిపై అఘాయిత్యాలకు సైతం పాల్పడుతున్నారు. వృద్ధులపై నేరాలకు పాల్పడుతున్న వారిలో చాలా మంది తెలిసిన వాళ్లే ఉంటున్నారు. ఒంటరి వృద్ధ దంపతులు.. లైంగికదాడి యత్నాలు%% వృద్ధులను దోచుకోవడం%% వారి వద్ద దొంగతనం చేయడం వంటి కేసులు తరచూ పోలీస్‌స్టేషన్లకు వస్తున్నాయి. వారి సొంత పనులు చేసుకునేందుకు వారిలో సత్తువ లేకుండా పోతున్న సమయంలో వారిపై దాడులు చేయడం సభ్యసమాజమే సిగ్గుపడాల్సిన పరిస్థితి. అయితే నేర స్వభావం ఉన్న వాళ్లు మద్యం, గంజాయి మత్తులోనూ ఈ దారుణాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతున్నాయి. దీంతో పాటు వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారిని హత మార్చి ఆస్తులను కొట్టేయాలనే దుర్బుద్ధి కొందరిలో ఉంటుంది. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో ఆలోచనతో వృద్ధులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడడం ఆందోళన కల్గిస్తోంది. తాజాగా హైదరాబాద్ శివారులోని యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో 90 ఏండ్ల వృద్ధురాలిపై గంజాయి, మద్యం మత్తులో యువకులు లైంగికదాడికి యత్నించిన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి ఘటనలకు తావులేకుండా ఉండేందుకు పోలీసులు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని, నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

**వృద్ధ దంపతులే టార్గెట్‌గా..!**

అంబర్‌పేట్‌లో లింగారెడ్డి(80), ఆయన భార్య ఉర్మిళ(70)ని గత ఏడాది అక్టోబర్ నెల్లో గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఇద్దరు వృద్ధ దంపతులే ఇంట్లో ఉంటారు. ఈ కేసులో నిందితులను ఇప్పటి వరకు పోలీసులు గుర్తించలేదు. ఈ కేసు మిస్టరీగానే మారిపోయింది. దోపిడీ దొంగతనం లక్ష్యంగా ఈ హత్య జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేసినా ఆ కోణంలో తగిన ఆధారాలు లభించలేదు. దీంతో ఆర్థికపరమైన, కుటుంబ పరమైన, ఇంకా ఇతరాత్ర వ్యవహారాలే ఈ హత్యకు దారి తీసి ఉంటాయనే మిగతా నుమానంతో ఇంకా ఈ కేసు దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ కేసు ఇప్పటి వరకు ఛేదించపోవడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఒకప్పుడు హైదరాబాద్‌లో నేరం జరిగొద్దు.. జరిగితే వెంటనే ఆయా కేసులను ఛేదించాలనే పట్టుదలతో పోలీసులు పనిచేసేవారు.



ఇప్పుడుఆ పట్టుదల ఏమైందనేదీ ప్రశ్నార్థకంగా మారింది. రాజేంద్రనగర్‌లోని అర్వింద్ రెసిడెన్సీలో నివాసముండే రిటైర్డు బ్యాంకు ఉద్యోగి అబ్దుల్లా(77), రిటైర్డు పాలిటెక్నికల్ కాలేజీ లెక్చరర్ రిజ్వానా బేగం(70) దంపతులను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు బాధితులైన అబ్దుల్లా వద్ద గతంలో డ్రైవర్‌గా పనిచేసిన షకీల్‌గా గుర్తించారు. షకీల్ తన స్నేహితుడైన ముజీబుద్దీన్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు నిర్ధరణ కావడంతో ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. 8 నెలల క్రితం ఉద్యోగం నుంచి తీసేయడంతో, మరెక్కడ కూడా ఉద్యోగం దొరకక వృద్ధులపై పగ పెంచుకున్న షకీల్, వృద్ధులు నివాసముండే అపార్టుమెంట్‌లోకి బుర్కాతో తెలిసిన వ్యక్తులుగా లోపలికి వెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు.

నగర శివారులోని కందుకూర్ గ్రామ శివారులో వ్యవసాయ క్షేత్రంలో నివాసముండే నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన ఈశయ్య(70), శాంతమ్మ(65) దంపతులను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న రాచకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈ కేసుతో పాటు మరుగున పడిపోయిన మరో కేసును కూడా ఛేదించారు. దాసర్లపల్లి గ్రామానికి చెందిన శివకుమార్(25) మద్యం మత్తులో ఈ వృద్ధ దంపతులను హత్య చేసినట్లు నిర్ధారించారు. నిందితుడు ఒంటరి మహిళలు కన్పిస్తే వాళ్లపై లైంగికదాడి, లైంగికదాడి యత్నానికి పాల్పడే స్వభావం ఉండడంతో పోలీసులు లోతైన దర్యాప్తు జరపడంతో 2023లో ఫామ్ హౌస్‌లో ఒక మహిళలను హత్య చేసిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది.

## కాంగ్రెస్ చెప్పిన 'మార్పు' ఇదేనా?: హరీశ్ రావు

ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మారితే మార్పు వస్తుందని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, అయితే ఇప్పుడు గ్రామాల్లో కనిపిస్తున్న ఈ దుస్థితేనా ఆ మార్పు? అని హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. "ఇది మార్పు కాదు, ఏమార్పు" అంటూ ఆయన తన పోస్టులో ఎద్దేవా చేశారు. గ్రామ స్వరాజ్యానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మాత్రం గ్రామాలకు నిధుల కటకట ఏర్పడిందని హరీశ్ రావు ఆరోపించారు.

ఈ నిధుల కొరత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## చార్మినార్, ఫలక్‌నుమా వద్ద మెట్రో పనులకు బ్రేక్: హైకోర్టు కీలక ఆదేశాలు!

తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, మెట్రో రెండో దశ పనుల వల్ల చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్‌తో పాటు పురానీ హవేలీ, దారుల్‌షిఫా మసీద్, మొగల్‌పురా టూంబ్ వంటి అనేక చారిత్రక కట్టడాల భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వారసత్వ కట్టడాలపై పడే ప్రభావంపై సమగ్రమైన అధ్యయనం నిర్వహించకుండా పనులు చేపట్టడం సరికాదని ఆయన వాదించారు. హెరిటేజ్ పరిరక్షణ నిపుణులు, పట్టణ ప్రణాళికా విభాగం నిపుణులు, పర్యావరణవేత్తలు, స్థానిక ప్రజల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర కమిటీ ద్వారా అధ్యయనం చేయించాలని కోరారు. తెలంగాణ వారసత్వ కట్టడాల పరిరక్షణ చట్టం, కేంద్ర పురావస్తు శాఖ చట్టంలోని నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే పనులు కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ అభ్యర్థించారు. అప్పటివరకు చారిత్రక కట్టడాల సమీపంలో మెట్రో రైలు పనులను నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ, ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయడానికి మూడు వారాల సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణ జరిగే వరకు చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో మెట్రోకు సంబంధించిన ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది.

## యూకే పర్యటనలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని యూనస్‌కు చేదు అనుభవం

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ప్రస్తుతం యూకేలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయనకు కొన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో పాటు బ్రిటన్ రాజు ఛార్లెస్-3తో సమావేశం కావాలన్న ఆయన ప్రయత్నాలు సఫలం కాలేదు. జూన్ 13వ తేదీ వరకు మహమ్మద్ యూనస్ యూకేలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో సమావేశమయ్యేందుకు ఆయన ప్రయత్నించారు. ఇందుకోసం అక్కడి ప్రభుత్వానికి ఒక అధికారిక లేఖ కూడా రాశారు. అయినప్పటికీ బంగ్లాదేశ్ అధినేతతో సమావేశానికి స్టార్మర్ సానుకూలంగా స్పందించలేదని సమాచారం. అదే సమయంలో బ్రిటన్ రాజు ఛార్లెస్-3తో సమావేశం కోసం యూనస్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో యూనస్ మాట్లాడుతూ "బంగ్లాదేశ్‌లో గత పాలకులు దోచుకున్న సొమ్మును విదేశాలకు తరలించారు. అందులో ఎక్కువ భాగం యూకేకే చేరింది. ఈ సొమ్మును కొత్తగా ఏర్పడిన మా ప్రభుత్వం తిరిగి రాబట్టడంలో యూకే సహకరించడం వారి నైతిక బాధ్యత" అని అన్నారు. స్టార్మర్‌తో ప్రత్యక్షంగా చర్చలు జరగనప్పటికీ తమ ప్రయత్నాలకు ఆయన కచ్చితంగా మద్దతు ఇస్తారనే నమ్మకం ఉందని యూనస్ పేర్కొన్నారు. ఇదే సమయంలో బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం గానీ ఆసక్తి గానీ తనకు లేదని మహమ్మద్ యూనస్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

**హైదరాబాద్ :** నగరవాసులను గురువారం రాత్రి భారీ వర్షం ముంచెత్తింది. ఏమాత్రం ఊహించని విధంగా ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన నగరంపై విరుచుకుపడటంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ ఆకస్మిక వర్షం కారణంగా నగర జీవనం స్తంభించిపోయింది. నగరంలోని హయత్‌నగర్, ఉప్పల్, కోఠి, తార్నాక, సికింద్రాబాద్ వంటి తూర్పు, మధ్య ప్రాంతాలతో పాటు బంజారాహిల్స్, అమీర్‌పేట, సనత్ నగర్ వంటి పశ్చిమ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఈ కుండపోత వాన ధాటికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. అనేక రహదారులపై పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కార్యాలయాల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే సమయం కావడంతో పలు ప్రధాన కూడళ్లలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నిలిచిన నీటిలో వాహనాలు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా, నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా చురుగ్గా కదులుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రానున్న ఐదు రోజుల పాటు తెలంగాణలో పలిచోట్ల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వారు వెల్లడించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కురిసిన వర్షం రుతుపవనాల క్రియాశీలతకు నిదర్శనమని, రాబోయే రోజుల్లోనూ ఇలాంటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

## రుచికే కాదు.. ఆరోగ్యానికీ రోజ్‌మేరీ!



విదేశాల నుంచి దిగుమతైన ఆహార పదార్థాల్లో ఒకటి రోజ్‌మేరీ. పాశ్చాత్య వంటలకు మరింత రుచిని జోడించేందుకు దీనిని జతచేస్తారు. అయితే రుచికి మాత్రమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలకు రోజ్‌మేరీ ప్రసిద్ధి చెందింది. ఇది మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా రోగనిరోధక శక్తి పెంచడంలోనూ సాయపడుతుంది. రోజ్‌మేరీ వల్ల మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. రోజ్‌మేరీ మెదడు ఆరోగ్యాన్ని పెంపొందించడంలో గణనీయమైన పాత్ర పోషిస్తుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడానికి, వృద్ధుల్లో అల్జీమర్స్ ప్రభావాన్ని తగ్గించడానికి రోజ్‌మేరీ ఉపయోగపడుతుంది. రోజ్‌మేరీ మెదడుకు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది, దీనివల్ల మెదడుకు ఎక్కువ ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. తద్వారా మానసిక స్పష్టత మెరుగుపడుతుంది. రోజ్‌మేరీ ఒత్తిడి, ఆందోళనను తగ్గించి, మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. ఒత్తిడి తగ్గడం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచన స్పష్టత మెరుగుపడతాయి. రోజ్‌మేరీలోని 1, 8-సినియోల్ అనే సమ్మేళనం ఎసిటైల్‌కోలిన్ విచ్ఛిన్నం కాకుండా నిరోధిస్తుంది. ఇది జ్ఞాపకశక్తి, ఏకాగ్రత సామర్థ్యాన్ని పెంచుతుంది. రోజ్‌మేరీలోని యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సిడేటివ్ ఒత్తిడి నుండి మెదడు కణాలను రక్షిస్తాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు మెదడు కణాల పనితీరును మెరుగుపరుస్తాయి. రోజ్‌మేరీ ఆకుల వాసనే ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని అందిస్తుంది. ఉద్వేగాలు నియంత్రణలో ఉంటాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. నాలుగైదు నిమిషాలు ఈ వాసన పీల్చడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. అంతేకాదు, రోజ్‌మేరీ ఆకులను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల జీర్ణక్రియలు సాఫీగా సాగుతాయి. కడుపుబ్బరం, ఉబకాయం తగ్గుతాయి. రోజ్‌మేరీ ఆకుల్లో సి-విటమిన్ గణనీయంగా లభిస్తుంది. దానివల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నోటిపూత తగ్గుతుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

## రైలు బోగీలో గర్భిణి ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



**సత్యమేవ జయతే – బాసర :** ఓ నిండు గర్భిణి రైలు బోగీలో ప్రసవించింది. ఆ తర్వాత ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన బాసర రైల్వే స్టేషన్‌లో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని ధర్మాబాద్ మండలం కర్ఖెళ్లి గ్రామానికి చెందిన నాగేశ్వరి(32)కి నెలలు నిండాయి. అయితే చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వచ్చారు. చికిత్స అనంతరం తన సొంతూరికి వెళ్లేందుకు గర్భిణి.. కాచిగూడ – నాగర్సోల్ రైలు ఎక్కింది. బాసర రైల్వే స్టేషన్ సమీపంలో ఆమె పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో రైలు బోగీలోనే నాగేశ్వరి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్రమత్తమైన ఆమె కుటుంబ సభ్యులు రైల్వే పోలీసు సురేశ్‌కు సమాచారం అందించగా, స్టేషన్ మేనేజర్‌ను అలర్ట్ చేశారు. బాసర రైల్వే స్టేషన్‌లోనే రైలును కాసేపు నిలిపి.. బాలింతను ఆమె బిడ్డను అంబులెన్స్‌లో ఎక్కించి సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ భైంసా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## పిడుగు పడి ఇద్దరు మహిళల మృతి



సత్యమేవ జయతే – ఆదిలాబాద్ ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో రెండు గ్రామాల్లో పిడుగు పాటు తో ఇద్దరు మృతి చెందారు. గురువారం వ్యవసాయ కూలీ పనుల కోసం వెళ్లిన మహిళలు వర్షంలో పనిచేస్తుండగా ఒక్కసారిగా పిడుగులు పడడంతో ఇద్దరు మృతి చెందారు. జిల్లాలోని బేల మండలంలోని సాంగిడిలో గేడం నందిని, సోన్కాస్ గ్రామంలో కోవ సునిత పొలంలో విత్తనాలు నాటుతుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన విషయం తెలియగానే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. సంబంధిత అధికారులకు , పోలీసులకు సమాచారం అందజేశారు. కాగా భారీ వర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలు జలమయంగా మారాయి.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఈఓ శ్రీనివాస్



సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : విద్యార్థులు అందరూ ప్రభుత్వం అందించే అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరికొండ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్స్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలన్నారు.బాగా చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని. పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వనతడుపుల రవికుమార్, చంద్రశేఖర్, అనిత శ్రీనివాస్, విజయ, అశోక్, కవిత, సలావుద్దీన్. సిఆర్పి విజయ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎన్నికల్లో వంశీకి రామగిరి ప్రెస్‌క్లబ్ మద్దతు



స్సత్యమేవ జయతే – పెద్దపల్లి పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అధ్యక్షుడి బరిలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మల్లోజుల వంశీ బరిలో నిలిచారు. ఈ మేరకు గురువారం సెంటినరీ కాలనీ లో రామగిరి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గోదావరిఖని ప్రెస్ క్లబ్ సెక్రటరీ పందిల్ల శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షులు పాలకుర్తి విజయ్, జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ కె.ఎస్.వాసు తో పాటు వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ తనను గెలిపిస్తే జర్నలిస్ట్ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మెజారిటీ సభ్యులందరూ వంశీ కి మద్దతు ప్రకటించారు. ఆదివారం జరిగే ఎన్నికల్లో వంశీనే గెలిపించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రెస్ క్లబ్ భాద్యులు పీవీ రావు, పొన్నం శ్రీనివాస్, జ్యోతుల ప్రవీణ్, కాపర్తి వెంకటేష్, పెరబోయిన రవీందర్, చిందం రమేష్, మల్యాల రమేష్, సూత్రం శ్రీధర్, చింతం కిరణ్, చిలుక సురేష్, పోలు మధూకర్, ఊట్ల తిరుపతి రెడ్డి, బర్ల వెంకటేష్, కాపర్తి అభిలాష్, గాజుల రఘుపతి, ఏకు రవీంద్ర, సిద్ధం ప్రదీప్, దాసరి భరత్, జి.కె.రాజు, నాంసాని సందీప్, బొల్లపెల్లి సాయి కుమార్, దొంతుల మణికంఠ, పానుగంటి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# జీపీ ట్రాక్టర్లకు తాళాలు వేసి ఎంపీవోకు అప్పగించిన కార్యదర్శులు



సత్యమేవ జయతే – వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : ఆర్థిక భారం భరించలేమంటూ గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపీ ట్రాక్టర్లకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తాళాలు వేసి ఎంపీఓ ప్రసాద్ అప్పగించారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రతి రోజూ సిబ్బంది ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డులకు తీసుకెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసేదని, పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో కొన్నేళ్లుగా పంచాయతీ కార్యదర్శులే ట్రాక్టర్ డీజిల్ నిర్వహణతో పాటు ఇతర ఖర్చులకు సంబంధించి అప్పులు చేస్తూ నిర్వహణ కొనసాగించామన్నారు. తాము తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్ట లేక మనోవేదనకు గురవుతున్నామని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు దామోదర్ రెడ్డి, అంజలి, సృజన్, సతీష్, రమేష్, ప్రసాద్, కుమార్, కల్పనా, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు డిపో పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క



సత్యమేవ జయతే – ములుగు ములుగు : ఏటూరు నాగారంలో బస్సు డిపో పనులకు గురువారం పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఏటూరునాగారంలో బస్సు డిపో ఏర్పాటు చేయాలనే చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. ఇక్కడ బస్సు డిపో నిర్మాణం కోసం రూ.7 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ములుగు, మంగపేటలో బస్టాండ్ నిర్మాణం చేపట్టడంతో పాటు గట్టమ్మ వద్ద కూడా బస్టాండ్ నిర్మిస్తామని తెలిపారు. బస్సు డిపో నిర్మాణ పనులు త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆర్టీసీ అధికారులను సీతక్క ఆదేశించారు.వచ్చే మేడారం జాతర నాటికి బస్సు డిపో పనులు పూర్తి చేసి రవాణా శాఖ మంత్రిచే ప్రారంభించాలని సూచించారు. జాతరకు బస్సులు నడపాలని సూచించారు. ములుగు కంటే ఏటూరునాగారంలోని బస్సు డిపో ఏర్పాటు చేస్తే మారుమూల ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని సూచించారు. జాతర వచ్చే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో మేడారం చేరుకుని దర్శనం చేసుకోవాలని కోరారు.

**– ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ ..**

నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు 5000 మంజూరు చేశారని, నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు అయినప్పటికీ ఐటీడీఏను దృష్టిలో పెట్టుకుని మరొక 1500 అదనంగా మంజూరు చేసినట్లు తెలిపారు. మూడు విడుతలుగా ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు దుస్తులు పంపిణీ చేశారు.

కార్యక్రమాల్లో ఐటిడిఎ పీఓ చిత్రా మిశ్రా, ఏఎస్పీ శివ ఉపాధ్యాయ, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి, డి ఆర్ డి ఓ సంపత్ రావు, గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, డిప్యూటీఆర్ ఎం కిరణ్, చీఫ్ ఇంజినీర్ భాస్కర్,ఐటిడిఏ ఏపీవో వసంతరావు, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, వసంత, శ్రీనివాస్, గుడ్ల దేవేందర్, వావిలాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన సివిల్ సర్వీసెస్ శిక్షణ బృందం



సత్యమేవ జయతే – కాళేశ్వరం కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో 2024 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ శిక్షణాధికారల బృందం గురువారం పర్యటించారు. ముందుగా కాళేశ్వర- ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెనను పరిశీలించి, కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నపెల్లి లక్ష్మీ పంప్ హౌస్‌ను సందర్శించారు. పంప్ హౌస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ ని సందర్శించి ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2024 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ శిక్షణా అధికారుల బృందం సౌరభ్ శర్మ, సలోని చోప్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తయానమావి, కోయ్యాడ ప్రణయ్ కుమార్‌తో పాటు మహదేవపూర్ డిప్యూటీ తాసిల్దార్ కృష్ణ, లైసన్ ఆఫీసర్ అబ్బాస్, కోర్స్ డైరెక్టర్ శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ డీఈఈలు సత్యబాబు, సురేష్, ఏఈఈ ,ఏఈలు, తదితరులు ఉన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి: చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగవాణి



సత్యమేవ జయతే మహబూబాబాద్ : బడీడు పిల్లలను బడులు చేర్పించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగవాణి అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి నెహ్రూ సెంటర్ వరకు ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కోర్టు న్యాయమూర్తుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవాణి మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను ప్రతి ఒక్కరిని బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని బాలలు చదువుకుంటేనే దేశ భవిష్యత్తు మంచిగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులను పనులకు పంపకుండా బడులకు పంపించాలని అప్పుడే విద్యార్థులు శారీరకంగా మానసికంగా ఉల్లాసంగా ఉంది ప్రగతికి దోహదపడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాదులు ఐసీడీఎస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు

# ప్రత్యేక చర్యలు చేపడతాం : జిల్లా ఎస్పీ



**సత్యమేవ జయతే – నారాయణపేట :** మక్తల్ మండల పరిధిలోని బొందలకుంట గ్రామ స్టేజి సమీపంలో జాతీయ రహదారి 167పై తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాద ఘటనాస్థలాన్ని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం గురువారం ఉదయం పరిశీలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించి వారిని సురక్షితంగా వారు వీళ్లకు చేరుకునే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని నిశితంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ యోగేష్ గౌతం విలేకరులతో మాట్లాడుతూ మక్తల్ మండలం బొందలకుంట గ్రామ స్టేజి వద్ద తెల్లవారుజామున 165 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుండి వచ్చిన వోల్వో బస్సు ఢీకొనడం వల్ల, అందులో ప్రయాణిస్తున్నటువంటి 18 మంది ప్రయాణికులకు గాయాలు కావడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని నిశితంగా పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. బొందలకుంట గ్రామ స్టేజీ సమీపంలో జాతీయ రహదారి 167పై హైదరాబాద్ వైపు వెళ్తున్నటువంటి లారీ రిపేరు నిమిత్తం రోడ్డు పై ఆగి ఉన్నందువల్ల, జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు లారీని గమనించి అక్కడ కోన్స్ అడ్డుగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుండి ప్రయాణికులను తీసుకొని హైదరాబాద్ వైపు వెళ్తున్నటువంటి వోల్వో బస్సు డ్రైవర్ వేగంగా నిర్లక్ష్యంతో డ్రైవ్ చేయడం వల్ల జాతీయ రహదారిపై యాగి ఉన్న లారీని వెనుక భాగంలో ఈ కొట్టడం వల్ల ప్రమాదం సంభవించిందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు రెండు కాళ్లు విరగడంతో పాటు మరొక ఐదు మందికి కాళ్లు ఫ్యాక్చర్స్ కావడం జరిగిందన్నారు. మిగతా వారికి స్వల్ప గాయాలు కావడం జరిగిందని ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులందరికీ మెరుగైన చికిత్స అందించాలని వారిని రాయచూర్, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాల ఆసుపత్రులకు తరలించడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు.

నారాయణపేట జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి, ఎక్కడికక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి అక్కడ సైన్ బోర్డ్స్, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలీస్ శాఖ తరపున జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సూచించారు. అనుకోకుండా అక్కడక్కడ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని పూర్తిస్థాయిలో నివారించడానికి తగిన చర్యలు త్వరలోనే తీసుకు రావడం జరుగుతుందన్నారు. నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం పెద్ద చింతకుంట నుండి కృష్ణ బ్రిడ్జి వరకు నిరంతరం హైవే పెట్రోలింగ్ జరుగుతూనే ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ఏదైనా సాంకేతిక లోపంతో వాహనాలు ఆగితే హైవే పెట్రోలింగ్ పోలీసులు అట్టి వాహనాలను సైడ్‌కు జరిపి నిలిపే విధంగా చర్యలు చేపడుతున్నారని సూచించారు. పెద్ద చింతకుంట, దండు క్రాస్ రోడ్, తోపాటు తదితర ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే స్థలాలను పరిశీలించడం జరిగిందని సూచించారు. జాతీయ రహదారిపై ప్రయాణం చేసే వాహనదారులు సాధ్యమైనంత వరకు రోడ్డుపై వాహనాలను నిలుపుకోరాదని సూచించారు. అత్యవసర సమయంలో వాహనాలకు రిపేర్ అయి రోడ్డుపై నిలబడితే తగిన సూచికలను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ వెంబడి మక్తల్ సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సమస్యల స్వాగతం

- మోగిన గంట.. విద్యార్థులకు తంటా.. - నేడు పాఠశాలల పునః ప్రారంభం - ముందుకు సాగని 'అమ్మ ఆదర్శ' పనులు - అనేక స్కూళ్లలో అసౌకర్యాల తిష్ట - అసంపూర్తి పనులతో అస్తవ్యస్తం - విద్యార్థులకు తప్పని ఇబ్బందులు - మానుకోట జిల్లాలో 167 పాఠశాలలు మూసివేత - సౌకర్యాలు, విద్యార్థులు లేరనే సాకుతో మూసేసిన ప్రభుత్వం - ప్రజాప్రతినిధులు పట్టించుకోక చదువుకు దూరమవుతున్న గిరిజన బిడ్డలు










**సత్యమేవ జయతే ఉమ్మడి వరంగల్ :** విరిగిన బెంచీలు, నాచుపట్టిన గోడలు, కంపుకొడుతున్న బాత్‌రూంలు, ప్రమాదకరంగా ఉన్న పంపుహౌస్‌లు, వంట గదులు, విద్యుత్ బల్బులు, స్విచ్ బోర్డులు, కరెంట్ లేక చీకటి గదులు, గేటు లేని కాంపౌండ్ గోడలు, పిచ్చిమొక్కలు మొలిచిన ఆటస్థలాలు, కొన్నిచోట్ల నిర్మాణం పూర్తయినా పెయింట్ వేయని, ఫ్లోరింగ్ చేయని పాఠశాలలు.. ఇలా మరెన్నో సమస్యల నడుమ నేడు సర్కారు బడులు తెరుచుకోనున్నాయి. మొన్నటిదాకా వేసవి సెలవుల్లో సరదాగా గడిపి గురువారం ఉత్సాహంతో పాఠశాలల్లో అడుగుపెట్టే విద్యార్థులకు ఒక్కో చోట ఒక రకమైన సమస్యలు స్వాగతం పలుకనున్నాయి.
గత బీఆర్ఎస్ 'మన ఊరు-మన బడి' ద్వారా ఎన్నో పాఠశాలల రూపురేఖలు మార్చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం దానిని 'అమ్మ ఆదర్శ పాఠశాల'ను తీసుకొచ్చి ఎంపిక చేసిన చాలా పాఠశాలల్లో ఇప్పటివరకు పనులు పూర్తిచేయలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉండగా.. కొన్నిచోట్ల విద్యార్థులు లేరనే సాకుతో గతేడాది వందలాది పాఠశాలలను మూసేసిన రేవంత్ సర్కారు వాటిని తెరిపించే ప్రయత్నం చేయకపోవడంతో మారుమూల ప్రాంత విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తోంది. అంతేగాక ఏజెన్సీ ఏరియాలో ఏజెన్సీలకు ప్రభుత్వ బిల్లులు చెల్లించకపోవడంతో 'సీఎం బ్రేక్ ఫాస్ట్' నిలిచిపోయి పిల్లలు అల్పాహారానికి నోచుకోవడం లేదు.

**ఏడాదిన్నర గడిచినా అక్కడే పనులు..!**

హనుమకొండ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా మారాయి. జిల్లా విద్యాశాఖాధికారి స్పందించకపోవడంతో కొన్ని పాఠశాలల్లో అసౌకర్యాలు తిష్ట వేశాయి. నడికూడ మండలం రామక్రిష్ణాపురం, హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి, అర్వపల్లిలోని జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మన ఊరు-మన బడి' స్థానంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 416 పాఠశాలలను ఎంపిక చేసింది. అయితే ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకు పాఠశాలల్లో పనులు ప్రారంభించ లేదు. ఇంకా పాఠశాల్లో ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా ఉంది. ఎంపికైన పాఠశాలల్లో ఇంకా పెయింటింగ్, విద్యుత్ నీటి సరఫరా, మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నారు.
డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు సరఫరా చేయనున్నారు. జిల్లాలో ప్రాథమిక 304, ప్రాథమికోన్నత 60, ఉన్నత పాఠశాలలు 128 కలిపి మొత్తం 492 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 29,050 మంది విద్యార్థులు చదువుతున్నారు.
అందులో బాలురు 14642, బాలికలు 14408 మంది ఉన్నారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీగా ఉండడంతో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. సరిపడా పారిశుధ్య కార్మికులు లేక అస్తవ్యస్తంగా మారింది. స్కావెంజర్లను తొలగించడంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రం చేసేవారు లేక కంపుకొడుతున్నాయి. అధికారులు పట్టణాల్లో పురపాలిక కార్మికులు, గ్రామాల్లో పంచాయతీ కార్మికులకు పారిశుధ్య చర్యలు మాత్రం కనిపించడం లేదు. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాటికి నీటి వసతి, ప్రహరీ వంటి కనీస సౌకర్యాలు కూడా లేవు.

**- మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : డీఈవో వాసంతి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. పాఠశాలల ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, ఏకరూప దుస్తులు అం దించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నా, గతేడాది సర్దుబాటు చేశాం. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

**- మూతబడినా పట్టించుకోరు?**

ప్రభుత్వ బడుల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. దీనిని సాకుగా చెబుతూ ప్రభుత్వం మహబూబాబాద్ జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరంలో 167 బడులను మూసివేసింది. అందులో తరగతి గదులు, పరిశుభ్రత, నీటి సౌకర్యం, టాయిలెట్స్ లేవనే అనేక కారణాలతో వాటిని మూసివేశారు. ఎక్కువ శాతం తండాలు, కోయ గూడేల్లోని బడులే మూతపడ్డాయి.
ఫలితంగా గిరిజన ఆవాస ప్రాంతాలు ఎక్కువగా ఉండే మానుకోట జిల్లాలో విద్యార్థుల చదువుకు దూరం కావాల్సి వస్తోంది. ప్రభుత్వం పట్టించుకోకపోవడం, స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ లేక, సౌకర్యాలు కల్పించకపోవడం వల్లే బడులు ఎక్కువ సంఖ్యలో మూతపడుతున్నాయని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులో ఏజెన్సీ ప్రాంతాల్లో 140, గిరిజన తండాల్లోనే ఎక్కువ ఉన్నాయి. మహబూబాబాద్ మండలంలో 119 పాఠశాలలకు గాను 19 మూతపడ్డాయి. కేసముద్రంలో 65కి గాను 8, గూడూరులో 93కి 11, ఇనుగుర్తిలో 28కి 8, నెల్లికుదురులో 55కి గాను 4, డోర్నకల్‌లో 50కి గాను 12 పాఠశాలలు, కురవిలో 57కి గాను 6, మరిపెడలో 100కు 36, సీరోలులో 27కు 3, నర్సింహులపేటలో 46కి 6, దంతాలపల్లిలో 29కి 9, చిన్నగూడూరులో 20కి 9, తొర్రూరులో 54కి 8, పెద్దవంగరలో 32కి 4, గార్లలో 59కి 9, బయ్యారంలో 77కి 3, కొత్తగూడలో 62కి 8, గంగారంలో 36కి 7 పాఠశాలలు మూతపడ్డాయి.

**- ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి**

ఒకసారి మూతపడిన బడి తెరుచుకోవాలంటే ఎన్నో ఇబ్బందులుంటాయి. తండాలో ఉన్న పేరెంట్, టీచర్ల ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కవచంలా ఉండాలి. అధికారులు కేవలం పిల్లలు లేరని సాకుతో టీచర్లను మరో చోటుకు డిప్యూటేషన్ వేస్తున్నారు. ప్రధానంగా కోయగూడేలు, ఆదివాసీ ప్రాంతాల్లో పాఠశాల చుట్టూ ఫెన్సింగ్, తాగునీటి సౌకర్యం కల్పించాలి. పాఠశాల్లో వసతులపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.
- బలాష్టి రమేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు
- బిల్లులియ్యక నిలిచిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'
- ఏజెన్సీలకు రూ.31.13 లక్షలు పెండింగ్

సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడంతో పాటు విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకం మధ్యలోనే ఆగిపోయింది. దీంతో విద్యార్థులు నిరాశకు గురయ్యారు.
ఏటూరునాగారం మండలంలో 36 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నా యి. వీటిల్లో బాలురు 1212 మంది, బాలికలు 1099 మంది సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద అల్పాహారం పొం దుతున్నారు.
విద్యార్థులకు అల్పాహారం అందించిన ఏజెన్సీలకు రావాల్సిన బకాయిలను గతేడాది నవంబర్ నుంచి ప్రభుత్వం నిలిపివేశారు. గత మార్చి నుంచి అక్టోబర్ వరకు ఏజెన్సీలకు మండలంలో సుమారు రూ. 31.13 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బిల్లుల జాప్యం జరగడంతో ఏజెన్సీలు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు అల్పాహారం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**- నాడు కళకళ.. నేడు వెలవెల**

బీఆర్ఎస్ హయాంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 149 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో బడులన్నీ అన్ని రకాల వసతులతో కళకళలాడాయి. జిల్లాలోని 12 మండలాల్లో మొత్తం 430 పాఠశాలలు ఉండగా అందులో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్న 51 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 88 ప్రాథమిక పాఠశాలలను మన ఊరు- మన బడి ద్వారా గుర్తించి అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, కరెంట్ సౌకర్యం, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణం, వంటగది, డిజిటల్ క్లాస్ రూంలు, చిన్న, పెద్ద మరమ్మతులు, ప్రహరీ గోడ, ఫర్నిచర్, పాఠశాలలకు రంగులు వంటి 12 రకాల పనుల కోసం గత కేసీఆర్ సర్కారు మొత్తం రూ.34,18,53,578 లను కేటాయించింది. అయితే అప్పుడు మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనులతో జిల్లాలో 149 పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పించడమే గాక విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించి పేద విద్యార్థులకు ఆకలిని తీర్చి ఆదుకున్నది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 265 పాఠశాలలను గుర్తించింది. కానీ ఆ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా దర్శనమిస్తున్నాయి.
గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండగా చాలా పాఠశాలల్లోని మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. తాగునీటి నల్లాల పైపులు దెబ్బతిని పనిచేయకుండా ఉన్నాయి. పాఠశాలల్లో గడ్డి, మొలిచి పిచ్చిగా పెరిగి ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

# సూర్యాతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన






సత్యమేవ జయతే - దేవరకొండ దేవరకొండ : దేవరకొండ మండలంలోని సూర్యాతండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలు నాయక్ గురువారం శంకుస్థాపన చేశారు. అలాగే బాన్య బావోజితండాలో ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు ఒక సైనికునిలా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సూర్యాతండాలో అమ్మ మాట %-% అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శిరందాసు కృష్ణయ్య, ఎంపీటీసీ దానియేల్, హౌసింగ్ డీఈ నాగేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్ నాయక్, మాజీ సర్పంచులు నారాయణ, నర్స నాయక్, శివయ్య, జగన్, లచ్చిరామ్, యాదయ్య, మీడియా %ఉ% కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ నర్ర బాలు, పంచాయతీ కార్యదర్శి పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఈఓ సుధాకర్‌రెడ్డి




**సత్యమేవ జయతే మునుగోడు :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని చండూరు ఎంఈఓ ఊట్కూరి సుధాకర్ రెడ్డి అన్నారు. పాఠశాల పునః ప్రారంభాన్ని పురస్కరించుకుని బంగారిగడ్డ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థిని విద్యార్థులకు పుష్పాలు అందజేసి పాఠశాలల్లోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వారి పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.బంగారిగడ్డ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రామలింగయ్య మాట్లాడుతూ.. బంగారిగడ్డ ఉన్నత పాఠశాల ప్రతి సంవత్సరం ఉత్తమమైన ఫలితాలు సాధిస్తూ వస్తుందన్నారు. గ్రామంలోని విద్యార్థులందరూ ప్రైవేటు పాఠశాలలకు, దూర ప్రాంత పాఠశాలలకు వెళ్లకుండా గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాదగోని వెంకటేశ్వర్లు, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేటి నుంచి స్కూల్స్ రీఓపెన్.. పాఠశాల బస్సులను ఆర్టీఏ అధికారుల కొరడా






**సత్యమేవ జయతే - హైదరాబాద్:** దాదాపు 45 రోజుల వేసవి సెలవుల అనంతరం తెలంగాణలో పాఠశాలలు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు ఫోకస్ చేశారు. నిబంధనలు పాటించని, ఫిట్‌నెస్‌లేని, సరైన పత్రాలు లేని బస్సులను సీజ్ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ వంటి ప్రధాన నగరాలు, జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్, అప్పా జంక్షన్, శంషాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల, మియాపూర్ తదితర ప్రాంతాల్లోని స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు గురువారం ఉదయం తనిఖీలు చేశారు. విద్యార్థులను తరలించే పాఠశాల బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బస్సు ఆర్సీ, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ వంటివి ఉన్నాయా? లేదా? అనేవి చెక్ చేశారు. ముఖ్యంగా హ్యాండ్ బ్రేక్, ఫైర్ ఎక్స్టింగ్విషర్, మెడికల్ కిట్‌లను కూడా పరిశీలించారు.

## విత్తనాల విషయంలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలి : ఏడీఏ నూతన్ కుమార్



సత్యమేవ జయతే - మానూర్ : విత్తనాలు అమ్మే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ నూతన్ కుమార్ అన్నారు. గురువారం మనూర్ రైతు వేదికలో ఫర్టి లైజర్ నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే అమ్మడంతో పాటు ఒరిజినల్ బిల్లులు మాత్రమే ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలకు తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే అమ్మాలన్నారు. తేదీ దాటిన మందులు షాపులో ఉండకూడదని, అలాంటి మందులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మహేష్ చౌహాన్, ఏఈ ఓ సంగమేష్, డీలర్లు మారుతి, జైపాల్ రెడ్డి, శంకర్, శ్రీకాంత్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, పవన్, రాజయ్య, స్వామి పాల్గొన్నారు.

## నిరుపేద దళిత కుటుంబానికి అండగా రెడ్ క్రాస్ సొసైటీ.. గృహ నిర్మాణానికి ఆర్థిక చేయూత



సత్యమేవ జయతే కరీంనగర్ : రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సంజీవ నగర్ లో దళిత కుటుంబానికి చెందిన బెజ్జాల అనిల్-మమత కు పెద్దపల్లి రెడ్ క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. కూలీ పని చేసుకునే అనిల్ కుటుంబం పూరి గుడిసెలో నివసిస్తుంది. ప్రతీ వర్షాకాలం ఈ గుడిసెలో ఉండడం వారికి, ఇద్దరు పిల్లలకి ఇబ్బందిగా మారింది. గతంలో పక్కనే గోడల వరకు ఆగిపోయిన గృహం ఉంది. ఈ విషయంపై స్థానిక తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు తెలియజేశారు. దీంతో వారు స్పందించారు. ఆ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహకారం అంది స్వామని దాతలు ముందుకు వచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కావేరి రాజగోపాల్, స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ ఎలిశాల వెంకటేశ్వర్ రావు, రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ సాదుల వెంకటేశ్వర్లు, సభ్యులు మీసాల సత్యనారాయణ, పోరండ్ల పరమేశ్వర్,రేకులపల్లి శంకర్, గద్దపల్లి సంపత్ కుమార్, వేల్పూరి సంపత్ రావు, కంకటి శ్రీనివాస్, బత్తుల రమేష్, పంపాటి శ్రీకాంత్ లు కలిసి ఇప్పటి వరకు 40 సిమెంట్ బస్తాలు, 16 రేకులు, 8 ఇనుప పైపులు, రెండు ట్రిప్పుల ఇటుక(బ్రిక్స్), రూ.20వేలునగదు సుతారి ఖర్చు కింద అందజేసి వారు తమ ఉదారత చాటారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీకి రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ధన్యవాదాలు తెలిపారు.

## భాగ్యనగరంలో దంచికొట్టిన వాన.. శేరిలింగంపల్లిలో అత్యధికంగా 148.5 మి.మీ. వర్షపాతం నమోదు



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గురువారం తెల్లవారుజామున వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. దీంతో భాగ్యనగరం తడిసి ముద్దైంది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు బస్తీల్లో ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. సెల్లార్లు కూడా నీట మునగడంతో స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తంగా రాత్రి కురిసిన భారీ వర్షానికి నగర ప్రజలు అతలాకుతలం అయ్యారు. ఇక శేరిలింగంపల్లిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద అత్యధికంగా 148.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. లింగంపల్లి ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వద్ద 114.3 మి.మీ., చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం వద్ద 109.8 మి.మీ., గచ్చిబౌలిలో 81.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక అత్యల్పంగా బండ్లగూడ పరిధిలోని మేకలమండి కమ్యూనిటీ హాల్ పరిసరాల్లో 27.3 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రధానంగా శేరిలింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో భారీగా వరద నీరు వచ్చి చేరింది. బ్రిడ్జికి ఇరువైపులా వరద నీరు ముంచెత్తడంతో పూర్తిగా ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పాపిరెడ్డి కాలనీ రాకపోకలు సైతం నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగంపల్లి తారా నగర్ పాపిరెడ్డి కాలనీ ప్రాంతాలు జలమయం కావడంతో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రహదారులపై నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ నెలకొంది. లింగంపల్లి మెహదీపట్నం ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. డోయాన్స్ కాలనీ సమీపంలో పెట్రోల్ బంకు, ప్రధాన రహదారిపై మోకాళ్ళ లోతు వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. లింగంపల్లి వైపు నుంచి గచ్చిబౌలి మాదాపూర్ ఐటీ కారిడార్ లకు వెళ్లే ఐటీ ఉద్యోగులు, వాహనదారులను హైడ్రా అధికారులు ట్రాఫిక్ పోలీసులు దారి మళ్ళించారు.

# వచ్చామా వెళ్లామా?.. బల్దియాలో అవకతవకలపై కంటితుడుపు విచారణ

- గత ఫిబ్రవరి 24న ఆర్డీ విచారణపై అతీగతి లేని పురోగతి
- పైగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకే అందలం



సత్యమేవ జయతే -కరీంనగర్ : 'ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడు' అన్న సామెత రామగుండం నగర పాలక సంస్థకు చక్కగా సరిపోతుంది. ఇక్కడ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు దేవుడెరుగు పైగా అందలం ఎక్కిస్తున్న పరిస్థితి ఉంది. పై అధికారులు సైతం వచ్చామా వెళ్లామా? అన్నట్టుగా కార్యాలయంకు వచ్చి కంటితుడుపుగా విచారణ చేపట్టడం మినహా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అంతుచిక్కడం లేదు. ఇందుకు దృష్టాంతమే గత ఫిబ్రవరి 24వ తేదీన పురపాలక సంఘం ప్రాంతీయ సంచాలకులు (ఆర్డీ) షాహీద్ మసూద్ రామగుండం కార్పొరేషన్ కార్యాలయంకు వచ్చి అవకతవకలపై రోజంతా విచారణ జరిపారు. నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. పైగా ఆ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి పదోన్నతులు కట్టబెట్టారన్న మరో ఆరోపణ ఉంది. రామగుండం కార్పొరేషన్ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగంలోనే అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి.

దీనిలో భాగంగా కార్పొరేషన్ లో రూ.2 కోట్లతో కొనుగోలు చేసిన వాహనాలు కార్యాలయంకు రాకముందే బిల్లులు జారీ చేశారన్న ఆరోపణ ఉంది. దీనికి తోడు పారిశుధ్య వాహనాలలో డీజిల్ లోడింగ్లో అవకతవకలు జరిగినట్లు 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుమలత రాజు, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ విజిలెన్స్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ క్రమంలో గత ఫిబ్రవరి 24వ తేదీన వరంగల్ రీజనల్ డైరెక్టర్ షాహీద్ మసూద్ కార్యాలయంకు ఆకస్మికంగా వచ్చి విచారణ చేపట్టిన సంగతి విధితమే. ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు రోజంతా రహస్య విచారణ జరిగింది. ఆ సమయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులను విచారించగా సరియైన రికార్డులు సమర్పించలేదు. దీనితో ఆర్ డీ అగ్రహం వ్యక్తం చేశారు. అలాగే డీజిల్ లెక్కలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు.

ఇది జరిగి దాదాపు 4 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పురోగతి కనిపించలేదు. పైగా ఆ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారికి అదే విభాగంలో పదోన్నతి కల్పించడం గమనార్హం. విచారణ అనంతరం హైదరాబాద్లోని విజిలెన్స్ డీఐజీకి మరోసారి కూడా ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ప్రస్తుత రీజనల్ డైరెక్టర్ షాహీద్ మసూద్ 2011లో ఇక్కడే కమిషనర్ గా పని చేసిన అనుభవం ఉంది. కార్యాలయంలోని అన్ని విభాగాలపై ఆయనకు పట్టు ఉంది. దాంతోపాటు స్థానిక అధికారులతో ఉన్న సత్సంబంధాల కారణంగానే ఇక్కడి అధికారులు ఖాతరు లేదని పలువురు చర్చించుకుంటున్నారు. తాజాగా డివిజన్ల విభజనలో తప్పుల తడకపై కూడా బుధవారం కార్యాలయంకు వచ్చిన ఆయన సాధారణంగా మ్యాప్ ల ను పరిశీలించి వెళ్లిపోయారు. దీంతో ఆర్డీ విచారణలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి పురోగతి ఉండటం లేదంటూ పలువురు సిటిజెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రియల్.. ఢమాల్!

- సగానికి పడిపోయిన రియల్ ఎస్టేట్ మార్కెట్
- మసకబారుతున్న విశ్వఖ్యాతి
- 2024 తొలి త్రైమాసికంతో పోలిస్తే 49% తగ్గుదల
- నగర మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా దాదాపు లక్ష యూనిట్లు
- అమ్మకాలైనా, కొత్త ప్రాజెక్టులైనా అన్నీ వెస్ట్, నార్త్ సిటీల్లోనే..
- సర్కారు ఎన్ని ప్రకటనలు చేసినా ఫోర్త్ సిటీ వంక చూడని మార్కెట్
- అపార్టుమెంట్లల్లో నివాస పరిధితో పోటీ పడుతున్న కామన్ ఏరియా



సత్యమేవ - హైదరాబాద్ : ఇక్కడే కాదు.. దేశవ్యాప్తంగానూ రియల్ ఎస్టేట్ సంక్షోభంలో ఉన్నది%ా% ప్రభుత్వ పెద్దలు ఈ ఊరడింపు మాటలు క్షేత్రస్థాయిలో రియల్ రంగానికి మాత్రం ఉపశమనం కలిగించడం లేదు. ఇతర నగరాల కంటే వేగంగా హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ మార్కెట్ ఢమాల్ అంటున్నది. బడా సంస్థలు మొదలు కాలనీల్లో ఉండే చిన్న బిల్డర్ వరకు కార్పొరేట్ సంస్థల్లోని రియల్ మార్కెట్ సంస్థల నుంచి గల్లీలో ఉండే రియల్ బ్రోకర్ దాకా ప్రస్తుత మార్కెట్‌ను చూసి విలవిలలాడుతున్నాడు. ఈ వాస్తవాలకు అద్దం పడుతూ అన్‌రాక్ సంస్థ నివేదిక వెలువడింది. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో రియల్ మార్కెట్ పరిస్థితి ఎలా ఉందనే వివరాలను 2024 తొలి త్రైమాసికంతో పోలుస్తూ నివేదిక ఇచ్చింది. ఇందులో గతేడాది పోలిస్తే అమ్మకాలు ఏకంగా 49 శాతానికి పడిపోయినట్లు తేలింది. ముఖ్యంగా హైదరాబాద్ మహా నగర మార్కెట్లో ఇప్పటికిప్పుడు అమ్ముడుపోకుండా దాదాపు లక్ష ఫ్లాట్లు సిద్ధంగా ఉండటం గమనార్హం. మరోవైపు అపార్టుమెంట్లల్లో నివాస-ఉమ్మడి ప్రదేశాలకు సంబంధించి రెరా కచ్చితమైన మార్గదర్శకాలు, నిబంధనల్ని రూపొందించకపోవడంతో కోట్లు పెట్టి కొంటున్న వినియోగదారులకు వెచ్చిస్తున్న దానిలో 62 శాతం మేరకే నివాస ప్రాంతం వస్తున్నట్లు అన్‌రాక్ నివేదికలో వెల్లడైంది. 2019లో ఇది 70 శాతం వరకు ఉంటే క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు నివేదిక స్పష్టం చేసింది.

**- దయనీయంగా..**

దేశంలోని ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా వంటి ఏడు మెట్రో నగరాల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థితిగతులపై అన్‌రాక్ సర్వే చేపట్టింది. ప్రధానంగా హైదరాబాద్‌కు సంబంధించి మార్కెట్ పరిస్థితి దయనీయంగా ఉన్నట్లుగా నివేదిక ద్వారా అర్థమవుతున్నది. గత ఏడాదిన్నరగా హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లోనే కాదు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలు సైతం గణనీయంగా తగ్గిందనేది అందరికీ తెలిసిన సత్యమే.

ఈ నేపథ్యంలో లక్షలాది కుటుంబాలు ఆధారపడే హైదరాబాద్ మహా నగర రియల్ రంగం పరిస్థితి నానాటికీ దిగజారుతుండటంతో అనుబంధ రంగాల్లోనూ ఆ ప్రభావం కనిపిస్తున్నది. అన్‌రాక్ నివేదికను పరిశీలిస్తే 2024 తొలి త్రైమాసికంతో పోలిస్తే కొత్త యూనిట్ల ప్రారంభంలోనే 55 శాతం తగ్గుదల నమోదైనట్లు తేలింది. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో కేవలం 13,900 యూనిట్లు మాత్రమే ప్రారంభమయ్యాయి. అమ్మకాలను చూస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10వేల యూనిట్లు అమ్ముడవగా, 2024 మొదటి మూడు నెలలతో పోలిస్తే అది 49 శాతానికి పడిపోవడం గమనార్హం. దీంతో మార్కెట్లో పెద్ద ఎత్తున అపార్టుమెంట్లల్లో ఫ్లాట్లు అమ్ముడుపోక అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. ఇప్పటికిప్పుడు (నివేదిక వచ్చే సమయానికి) హైదరాబాద్ మార్కెట్లో ఏకంగా 97,950 యూనిట్లు అమ్మకానికి ఉన్నట్లుగా తేలింది.

**- చెరిపేస్తే చెరగని డిమాండు...**

%ఆది నుంచి హైదరాబాద్ మహా నగరంలో వెస్ట్ సిటీకి డిమాండు భారీగా ఉంటుంది. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్కడ ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేయడంతో పాటు హైడ్రా, ఇతర శాఖల కూల్చివేతలు కూడా ఆ పరిధిలోనే ఎక్కువగా జరిగాయి. ఇదే సమయంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధుల్లో సీఎం రేవంత్ ఫోర్త్ సిటీని ప్రకటించారు. పెద్ద ఎత్తున కంపెనీలకు కేటాయింపులు చేయడంతో పాటు అనేక ప్రాజెక్టుల్ని అక్కడ ప్రకటించారు.

ఇక భవిష్యత్తు అంతా ఫోర్త్ సిటీలోనే ఉంటుందని చెప్పారు. కానీ రియల్ మార్కెట్ మాత్రం అటువైపు కన్నెత్తి చూడటంలేదని అన్‌రాక్ నివేదిక ద్వారా తెలుస్తున్నది. మహా నగరంలో ప్రారంభమైన కొత్త యూనిట్లలో ఏకంగా 82 శాతం వెస్ట్ సిటీ గచ్చిబౌలి, కొండాపూర్, తెల్లాపూర్, మణికొండ, కూకట్‌పల్లి, అత్తాపూర్, కోకాపేట, పటాన్‌చెరు, మాదాపూర్, అప్పా జంక్షన్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. కొద్దోగొప్పో జరిగిన అమ్మకాల్లోనూ వెస్ట్ సిటీలో 55 శాతం ఉంటే ఉత్తరం అంటే మియాపూర్, పోచారం, బాచుపల్లి, నిజాంపేట, బొల్లారం, యాప్రాల్, శామీర్‌పేట ప్రాంతాల్లో మరో 26 శాతం నమోదయ్యాయి. అంటే మార్కెట్లో 81 శాతం ఈ రెండు ప్రాంతాలకే పరిమితమైంది. కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలోనూ 62 శాతం వెస్ట్ సిటీలో ఉంటే 24 శాతం నార్త్ సిటీలో ఉంది.

**- కుచించుకుపోతున్న నివాస పరిధి..**

సాధారణంగా మనం అపార్టుమెంట్లల్లో కొనుగోలు చేసే ఫ్లాట్లల్లో నికర నివాస పరిధి (లివబుల్ స్పేస్-కార్పెట్ ఏరియా)తో పాటు కామన్ ఏరియాతో కలుపుకొని ధరను చెల్లిస్తాం. మనం చెల్లించే డబ్బుల్లో కామన్ ఏరియా అంటే ఎలివేటర్స్ లాబీలు, మెట్లు, క్లబ్‌హౌజ్‌లు, పార్కింగ్‌వంటి వసతులు (ఎమినిటీఎస్), టెరస్ వంటివి కూడా ఉంటాయి. అయితే దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో ఈ కార్పెట్ ఏరియా క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లుగా తేలింది. ఇందులో భాగంగా హైదరాబాద్ మహా నగరంలో వినియోగదారులకు నివాస పరిధి (కార్పెట్ ఏరియా) 2019 సంవత్సరంలో 70 శాతం దాకా ఉండేది. కానీ తాజాగా అది సరాసరిన 62 శాతానికి పడిపోయినట్లుగా అన్‌రాక్ నివేదికలో తేలింది. అయితే మనతో పోలిస్తే బెంగళూరులో ఇది ఇంకా ఘోరంగా ఉంది. 2019లో అక్కడ కార్పెట్ ఏరియా 70 శాతం వరకు ఉంటే ఇప్పుడు అది 59 శాతానికి పడిపోయింది. అంటే కామన్ ఏరియా 41 శాతంగా ఉంది.

**అన్‌రాక్ నివేదిక ప్రకారం వివిధ నగరాల్లో కామన్ ఏరియా పెరుగుదల ఇది...**

| | | | |
|---|---|---|---|
| ఢిల్లీ | 31 | 37 | 41 |
| ముంబై | 33 | 39 | 43 |
| బెంగళూరు | 30 | 35 | 41 |
| పుణె | 32 | 36 | 40 |
| హైదరాబాద్ | 30 | 33 | 38 |
| చెన్నై | 30 | 32 | 36 |
| కోల్‌కతా | 30 | 35 | 39 |
| సరాసరి | 31 | 35 | 40 |

# గన్‌తో బెదిరించి.. ఐదు లక్షలతో ఉడాయించాడు.. కొంపల్లిలో ఘరానా దొంగతనం



సత్యమేవ జయతే -కుత్బుల్లాపూర్ : హైదరాబాద్‌లోని కొంపల్లిలో ఘరానా దొంగతనం జరిగింది. కిరాణాషాపులోకి వెళ్లిన ఓ దుండగుడు గన్ చూపించి.. రూ.5లక్షల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న లక్ష్మీ కిరణ జనరల్ స్టోర్ లో ఈ దొంగతనం జరగడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన మోటూరి సాయిబాబా కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం వైపునకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న లక్ష్మీ కిరాణా జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి అమ్మకాల ద్వారా వచ్చిన రూ.5లక్షల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను బ్యాగులో పెట్టుకుని షాపు మూసివేసేందుకు సిద్ధమయ్యాడు. ఇంతలో అకస్మాత్తుగా స్కూటీపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు హెల్మెట్ ధరించి, ముఖానికి మాస్క్ పెట్టుకుని షాపులోకి వచ్చారు. షాపు యజమాని దగ్గరకు వెళ్లి గన్ చూపించి బెదిరించి, అతని వద్ద ఉన్న నగదు బ్యాగును లాక్కొని వెళ్లాడు. ఈ క్రమంలో షాపులో పనిచేస్తున్న సేల్స్‌బాయ్ పర్వేజ్ వారిని అడ్డుకోబోయాడు. కానీ వారి నుంచి తప్పించుకుని బయటకు వెళ్లాడు. అప్పటికే మరోవ్యక్తి షాపు బయట బైక్‌పై రెడీగా ఉండటంతో ఇద్దరూ కలిసి మున్సిపల్ కార్యాలయం వైపునకు పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

**- గతంలో ఇదే షాపులో 10 లక్షల విలువచేసే సిగరెట్ ఇతర వస్తువుల అపహరణ...**

ఇదే షాపులో గతంలోనూ ఓ దొంగతనం జరిగింది. దాదాపు రూ.10 లక్షల విలువ చేసే వివిధ రకాల వస్తువులతో పాటు సిగరెట్ డబ్బాలను ఎత్తుకెళ్లారు. రాత్రి షాపు ముందు డీసీఎం వాహనం నిలిపి గుట్టు చప్పుడు కాకుండా వస్తువులతో హుడాయించిన సంఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఇదే ప్రాంతంలో వరుస దొంగతనాలు, సెల్ ఫోన్లు, పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు దొంగలింపబడ్డాయని స్థానికులు చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

**- వరుస సంఘటనలతో ఉలిక్కిపడుతున్న కొంపల్లి ప్రజలు**

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గత కొన్ని రోజుల నుంచి వరుసగా దొంగతనాలు, మర్డర్, ఇతర వ్యవహారాలు జరగడం పట్ల స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దొంగతనం జరిగిన షాపు సమీపంలో ఉన్న వెనకాల వీధిలో సాయంత్రం సమయంలో మార్కెట్లో మర్డర్ జరగడం విదితమే. కాగా నిత్యం ప్రజలు, వ్యాపారస్తులు, కూలీలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ వరుసల సంఘటనలు జరగడం పట్ల స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి వరుస సంఘటనలు జరగడం పట్ల పోలీస్ యంత్రాంగం నిఘా పూర్తిగా విఫలం చెందిందని స్థానికులు మండిపడుతున్నారు.

# 'మా భూమి మాకు కావాలి'

- అశ్వారావుపేట నుండి కొత్తగూడెం కలెక్టరేట్ వరకు ఆదివాసీల పాదయాత్ర
- వర్షంలో ఆగని నిరసన
- అదనపు కలెక్టరు హామీతో ఆందోళన విరమణ

సత్యమేవ జయతే -కొత్తగూడెం : 'మా భూమి మకే కావాలి ' అని ఆదివాసీలు అశ్వారావుపేట నుండి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. చంటి పిల్లలకు ఎత్తుకొని, యువకులు, వృద్ధులు సుమారు 80 కిలోమీటర్లు 150 కుటుంబాలు మూడు రోజులుగా పాదయాత్ర చేశారు. న్యాయం జరిగే వరకు కదిలేది లేదని జోరు వానలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయడంతో ఎట్టకేలకు జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వారి సమస్యను సావధానంగా విన్నారు. జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించి 10 రోజుల్లోగా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలో నివాసం ఉంటున్న ఆదివాసీలు సర్వే నంబర్ 30, 36, 39లో 1954 నుండి 150 కుటుంబాలు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు ఆదివాసి నాయకుడు మడకం నాగేశ్వర్ రావు తెలిపారు. పట్టా పాస్ పుస్తకాలు సైతం ప్రభుత్వం ఇచ్చిందని, అయినప్పటికీ లంకలపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ ఇదే అంటూ, ఇది అటవీ శాఖకు చెందినదని ఆదివాసీలను ఇబ్బందులు పెడుతూ వ్యవసాయం చేసుకోకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

హైకోర్టు సైతం 2011లో సదరు భూమి సాగు చేసుకుంటున్న 573 ఎకరాలు ఆదివాసీలదేనని స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ కోర్టు తీర్పును సైతం అధికారులు అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గత





దశాబ్ద కాలంగా అధికారులు ఈ సమస్యను పట్టించుకోకుండా తమను సేద్యం చేయకుండా అడ్డుకుంటున్నారని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జాయింట్ సర్వే చేయించి మా భూములు మాకు అప్పగించాలని కోరారు.

అదే విధంగా రామన్నగూడెంలో మంజూరైన నాలుగు ఇందిరమ్మ గృహాలను సైతం గిరిజనేతరులకు కేటాయించి 'పేసా ' చట్టంను తుంగలో తొక్కారని, ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు ఆదివాసి హక్కుల సంఘం, తుడుం దెబ్బ నాయకులు వాసం రామకృష్ణ దొర, ఆరెం ప్రశాంత్ తదితరులు సంఘీభావం తెలిపారు. పది రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే భూమిని స్వాధీనం చేసుకుంటామని అధికారులకు స్పష్టం చేశారు.

# 25% ఉచిత సీట్లు.. అమలుకు తూట్లుప్రైవేట్

# స్కూళ్లల్లో సీట్లు కేటాయిస్తామన్న ప్రభుత్వం

- ప్రైవేట్ స్కూళ్లల్లో సీట్లు కేటాయిస్తామన్న ప్రభుత్వం
- నేటి నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం
- ఇంకా ఏదీ తేల్చని సర్కారు, విద్యాశాఖ
- అమలుచేయబోమంటున్న ప్రైవేట్ స్కూళ్లు




**సత్యమేవ జయతే హైదరాబాద్ :** విద్యాహక్కు చట్టం 12(1)సీ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు 25% సీట్లను ఉచితంగా ఇవ్వాల్సి ఉంది. ఈ 25% సీట్లను పేద, అణగారిన, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేటాయించాలి. 2025-26 విద్యాసంవత్సరం గురువారం నుంచి ప్రారంభంకానున్నది. అయినా సర్కారు, విద్యాశాఖ దీనిపై ఏదీ తేల్చలేదు. దీంతో రాష్ట్రంలో ఇది అమలు కావడంలేదు. దీనిపై కొందరు హైకోర్టులో కేసు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం 12(1)సీ అమలుచేస్తామని కోర్టుకు తెలిపింది. స్కూళ్ల యాజమాన్యాలు 25% సీట్లను అమలుచేయబోమంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, బెస్ట్ అవైబుల్ స్కూళ్లకు వేలాది కోట్ల బకాయిలున్న నేపథ్యంలో తాము ఈ పథకాన్ని అమలుచేయబోమని భీష్మిస్తున్నాయి. తమను తప్పించాలని, సర్కారు చెల్లించే ఫీజులను విద్యార్థి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసుకోవాలంటూ సూచిస్తున్నాయి. దీంతో పీఠముడి నెలకొన్నది.

- విక్రమ్ బత్తుల - అంబేద్కర్ సేన, తెలంగాణ రాష్ట్ర కో - కన్వీనర్ మరియు సోషల్ మీడియా ఇంచార్జ్....

- 90వేలకు పైగా సీట్లు..

యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(యూడైస్) వివరాల ప్రకారం రాష్ట్రంలో ఒకటో తరగతిలో 3,61,244 సీట్లున్నాయి. వీటిలో 25% అంటే 90,311 సీట్లను ఆర్టీఈ 12(1)సీ సెక్షన్ ప్రకారం భర్తీచేయాలి. ప్రస్తుతం ఒకటో తరగతిలోనే సీట్లు కేటాయిస్తారు. ఆ తర్వాత క్రమంగా విస్తరిస్తారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 36కోట్ల భారం పడుతుందని అంచనా వేశారు. ప్రైవేట్ స్కూళ్లల్లో 25% సీట్లను సమర్థవంతంగా, సజావుగా అమలుచేసేందుకు రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని విద్యాకమిషన్ సిఫారసు చేసింది. పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతీయ వ్యత్యాసాల ఆధారంగా ఖర్చును నిర్ణయించాలని సూచించింది. మరికొన్ని సిఫారసులు చేసింది. ఈ సిఫారసుల్లో సర్కారు వేటిని ఆమోదించింది.. వేటిని పక్కనపెట్టింది అన్నది సస్పెన్స్‌గా మారింది.

మల్లేష్ గౌడ్, సంగారెడ్డి జిల్లా బీఅర్ఎస్ పార్టీ నాయకులు....

- 20 రాష్ట్రాల్లో అమలు..

విద్యాహక్కు చట్టం సెక్షన్ 12 (1)సీని జాతీయంగా 20 రాష్ట్రాలు అమలుచేస్తున్నాయి. ఏపీ, తమిళనాడు, ఢిల్లీ సహా అనేక రాష్ట్రాల్లో ప్రైవేట్ స్కూళ్లల్లో 25% సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయిస్తున్నాయి. ఈ సెక్షన్‌ను తెలంగాణ, పంజాబ్, కేరళ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు మాత్రమే అమలుచేయడం లేదు. 2024 ఆగస్టులో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజ్యసభలో మాట్లాడుతూ.. తెలంగాణ, పంజాబ్, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలుచేయాలని కోరారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నది.

## గల్లీలో గలీజ్ దందాలు.. ఢిల్లీలో గులాంగిరి..

# రేవంత్ తీరుపై వేముల ప్రశాంత్ ఫైర్



**సత్యమేవ జయతే హైదరాబాద్ :** గల్లీలో గలీజ్ దందాలు చేస్తూ ఢిల్లీలో గులాం గురి చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తీరు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల వీరేశం మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నిన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చిట్ చాట్ చేశారు. మంత్రుల శాఖల కేటాయింపు కోసం, కాంగ్రెస్ పార్టీ అధినేతల అపాయింట్‌మెంట్ కోసం రెండు రోజులు ఢిల్లీలో పడిగాపులు కాసి అపాయింట్‌మెంట్ దొరకని ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నాడు. కేసీఆర్, కిషన్ రెడ్డి ఒక్కటే అని రేవంత్ రెడ్డి అన్న మాట అబద్ధం, అవాస్తవం. రేవంత్ రెడ్డి బీజేపీ ఒక్కటి అన్నది వాస్తవం. రేవంత్ రెడ్డి ,బీజేపీ దోస్తాన్ చాలా సార్లు బయట పడింది.

లోక్‌సభ ఎన్నికల్లో బలహీన అభ్యర్థులను పెట్టి బీజేపీ ఎంపీలు గెలవడానికి రేవంత్ రెడ్డి సహాయ పడ్డారు. స్వయంగా ఈ మాట బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్‌ను గెలిపించడానికి వేరే ప్రాంతం నుంచి సునీతా మహేందర్ రెడ్డిని నిలబెట్టారు. కిషన్ రెడ్డిని గెలిపించడానికి బీఆర్ఎస్‌లో ఉన్న దానం నాగేందర్‌ని సికింద్రాబాద్‌లో నిలబెట్టారు. కాంగ్రెస్ నుండి గతంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పలుమార్లు పోటీ చేసిన అనుభవం ఉన్న జీవన్ రెడ్డికి కాదని ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేని వెలిచాల రాజేందర్‌కు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌పై పోటీకి నిలిపారు. ఇలా నిజామాబాద్‌లో అరవింద్‌పై, మెదక్‌లో రఘునందన్ పై, ఆదిలాబాద్‌లో నగేశ్‌లపై రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బలహీన అభ్యర్థులను నిలబెట్టారు. 8 మంది బీజేపీ ఎంపీలలో 7 మందిని రేవంత్ రెడ్డినే గెలిపించారు. బీజేపీ పార్టీ కూడా రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వడం లేదు అని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు. స్వయంగా ప్రధాని మంత్రి మోదీ ఎలక్షన్ ప్రచారంలో తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తుంది అని మాట్లాడిన ఈడి, సీబీఐ ఎందుకు రావడం లేదు..? ఓటుకు నోటు కేసు ఎటుపోయింది, ఎందుకు జాప్యం జరుగుతోంది..? రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయినప్పుడు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకదు కానీ ప్రధానిని కలవడానికి 15 నిమిషాల్లో అపాయింట్‌మెంట్ ఎలా దొరుకుతుంది..? బండి సంజయ్ బహిరంగంగానే రేవంత్ రెడ్డి పదవి కాపాడుకోవాలని సూచనలు ఇస్తున్నాడు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా బొంద పెట్టడానికి కాంగ్రెస్, బిజెపి కలిసి పని చేయాలి అని బండి సంజయ్ అన్నారు. బీజేపీ కాంగ్రెస్ ఒక్కటే అనే సంకేతం బండి సంజయ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి బీజేపీలో జాయిన్ అయితే స్వాగతిస్తామని ఎంపీ అరవింద్ అంటున్నారు. ఇది రేవంత్ రెడ్డి, బీజేపీ దోస్తానకు సంకేతము కాదా..? నేను బీజేపీ స్కూల్‌లో చదువుకున్న అని రేవంత్ రెడ్డి ఢిల్లీలో అన్నారు. హైదరాబాద్‌లో అన్నది మోదీ విన్నాడో లేదో అని మళ్ళీ అవే మాటలు ఢిల్లీలో మాట్లాడిండు. బీజేపీలోకి వెళ్తాను అని సూచన ఇస్తున్నట్టున్నాడు. కాంగ్రెస్ పార్టీ వాళ్ళు రేవంత్ రెడ్డిని నమ్మకండి.. కాంగ్రెస్ పార్టీని ఖతం చేసి బీజేపీలోకి పోతారు అని ప్రశాంత్ రెడ్డి అన్నారు.

కేసీఆర్ తెలంగాణకు ఆత్మ. తెలంగాణ కోసం కేసీఆర్ పోరాడుతున్న సందర్భంలో ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు. ఏపీకి చంద్రబాబు నీళ్ల తీసుకెళ్తుంటే నోరు ముసుకున్న రేవంత్ రెడ్డి తెలంగాణ శత్రువు. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో దేశంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 4వ ప్లేస్‌కు, జీడీపీలో 4వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 13వ స్దానానికి దిగజార్చిన నువ్వు తెలంగాణ శత్రువు. తెలంగాణ అప్పుల పాలైందని, తెలంగాణ ముఖ్యమంత్రిగా వెళ్తే దొంగలా చూస్తున్నారని తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకి అన్యాయం చేస్తున్నారు. 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి తెలంగాణకు ఒక్క రూపాయి తీసుకురాలే. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న టీడీపీ ఎంపీలు వేల కోట్లు నిధులు తెచ్చుకున్నారు. నిధుల వరద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుపోతున్నారు. పోలవరం, అమరావతి రాజధాని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు వేల కోట్లు, బనకచర్లకు జాతీయ హోదా తెస్తుంటే మన కాంగ్రెస్, బిజెపి ఎంపీలు ఒక్క రూపాయి కూడా తెలంగాణకు తేవట్లేదు. కాబట్టి తెలంగాణకి అసలైన శత్రువులు బీజేపీ కాంగ్రెస్ పార్టీలే..? బీఅరెస్ పార్టీకి, కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం.. బీఆర్ఎస్ ఎంపీలు గెలిచి ఉంటే తెలంగాణకు ఈ గతి పట్టేదా. 45 సార్లు ఢిల్లీకి పోతే 4 సార్లు కూడా రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ దొరకలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి బతుకు అలా ఉంది అని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.

# సిబిఎస్ ఆచార్య ధ స్కూల్ ప్రారంభోత్సవం...

**- ఎమ్మెల్యే జిఎంఆర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**











**సత్యమేవ జయతే - గుమ్మడిదల :** మున్సిపల్ పరిధిలోని అన్నారం వార్డులో సెంట్రల్ సిలబస్ ఆచార్య ద స్కూల్ ను నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా గురువారం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యం అత్యున్నత హంగులతో పాఠశాలను ముస్తాబు చేసి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల హంగు ఆర్భాటాలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే పాఠశాల యాజమాన్యానికి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు అన్నారంతో పాటు ఎయిర్ ఫోర్స్ అకాడమీ జంగంపేట, జిన్నారం, వావిలాల, లక్ష్మీపతి గూడెం, నల్తూరు, కొర్లకుంట, కిష్టయ్య పల్లి, గడ్డపోతారం, గగిల్లాపూర్, చర్చి కాగిలాపూర్, తదితర గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి మండల మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి కుమార్ గౌడ్, పాఠశాల కరస్పాండెంట్ చిమ్ముల జైపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ చిమ్ముల లతా రెడ్డి, చైర్మన్ చిమ్ముల మల్లారెడ్డి మాజీ ఎంపిటిసిలు సురభి నాగేందర్ గౌడ్, మద్ది వీరారెడ్డి, మద్ది ప్రతాప్ రెడ్డి, మండలి తులసీదాస్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, గోకర్ జయశంకర్ గౌడ్, తిరుమల వాసు, ఇందెల సురేందర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, తుపాకుల రాజు, సంఘం శేఖర్ గౌడ్, బి నరహరి, ఎండి హుస్సేన్, కావలి ఐలేష్, చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, దేశబోయిన లక్ష్మణ్, బిక్షపతి రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, శ్యామల దేవేందర్ రెడ్డి, తో పాటు వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం : ఆర్డీఓ వేణుమాదవ్‌రావు



**సత్యమేవ జయతే - నల్గొండ :** భూ సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్డీఓ వేణుమాదవ్‌రావు అన్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం ధూపహాడ్ గ్రామంలో గురువారం తాసీల్దార్ లాలూ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. పలువురి రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని వారి వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని, సుధీర్ఘకాలంగా పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకుకోవచ్చన్నారు. భూ భారతి చట్టం ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా ఉందన్నారు. రెవెన్యూ సిబ్బంది మీకు అండగా ఉంటూ, మీ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

**- రేషన్ దుకాణం తనిఖీ**

ధూహాడ్ గ్రామంలో రేషన్ దుకాణంలో సన్న బియ్యం మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయడంపై ఆర్డీఓ తనిఖీ చేశారు. చౌక ధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ఆదేశించారు. చౌక దుకాణాల పనితీరును పర్యవేక్షించడం, పీడీఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడటం కోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రంజిత్ రెడ్డి, ఏఆర్ఐ అజీజ భేగం, సీనియర్ అసిస్టెంట్ రాధ పాల్గొన్నారు.

## లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి : ప్రిన్సిపల్ అనురాధ



**సత్యమేవ జయతే రామాయంపేట :** రామాయంపేట పురపాలిక పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు తమ ధరఖాస్తులను అందించాలని ప్రిన్సిపల్ అనురాధ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరలుతో మాట్లాడారు. 2025-26 సంవత్సరంకు గాను ఇంటర్ మొదటి సంవత్సరం అప్డేట్ చేయబడిందని అందు కోసం అర్హులైన లెక్చరర్లు ఇంగ్లీషు 1, తెలుగు 1, ఫిజిక్సు 1, కెమెస్ట్రీ 1, బోటనీ 1, జూలాజీ 1 పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు చేసుకునే వారు బీఈడీ, పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలన్నారు. గెస్టు ఫ్యాకల్టీగా ఈనెల 14వరకు తమ దరఖాస్తులను కేజీబీవిలో నేరుగా అందజేయాలన్నారు. అంతే గాకుండా బైపీసీలో జాయిన్ కావడానికి ఇంటర్ విద్యార్థులకు ఖాళీలు ఉన్నాయని విద్యార్థులు దరఖాస్తులను చేసుకోవాలన్నారు.

## 100.రోజులో భాగంగా వికారాబాద్ మున్సిపల్‌లో అవగాహన కార్యక్రమం...





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా... 100 రోజుల ప్రణాళికలో భాగంగా 11 వ రోజు పట్టణం యందు గల వ్యాపార సముదాయాల వారికి వాణిజ్య పన్ను చెల్లింపు మరియు సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన మరియు ఓపెన్ నాలా లో ఉన్న డిస్టింగ్ ను తొలగించటం మరియు పట్టణం యందు గల స్వీటు దుకాణాలు మరియు ఫాస్ట్ ఫుడ్ యజమానులకు తడి చెత్త మరియు పొడి చెత్త పై అవగాహన కల్పించడం జరిగినింధి ఇట్టి కార్యక్రమం లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాకేష్ రెడ్డి మరియు మేనేజర్ విఠల్ మరియు సానిటరీ ఇన్స్పెక్టర్ ఏసుదాస్ మరియు ఎనివైరన్మెంటల్ ఇంజనీర్ శ్రీనివాస్ మరియు జవాన్లు సిబ్బంది పాల్గొన్నారు...

## ల్యాబర్తిలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ సత్య శారద



**సత్యమేవ జయతే వరంగల్ :** ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా దాత కుల్ల యాకాంతం అందజేసిన పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, టై,బెల్ట్ లను విద్యార్థులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను బోధించే టాలెంటెడ్ ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎం.ఈ.ఓ శ్రీధర్, తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ గత కొన్ని రోజుల అవుతున్న స్పందించని అధికారులు..







**సత్యమేవ జయతే/హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల12వార్డులో మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి కథ కొన్ని రోజులు గడిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు, ఈ సందర్భంగా కాసాల గ్రామస్తులు మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి మిషన్ భగీరథ తాగునీటి పైప్ లైన్ లీకేజ్ త్రాగు నీరు వృదాగా పోతున్నాయని అధికారులకు మొరపెట్టుకున్న ఏమాత్రం స్పందిస్తాలేరని ఆరోపించారు, మంచినీటి తాగడానికి సరిపోయే నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు, వచ్చేది వర్షాకాలం కావడంతో కలుషితమైన నీటిని త్రాగినట్టయితే అనారోగ్యాలకు గురవుతామని గ్రామస్తులు వాపోయారు, కలుషితం నీరు తాగడంతో డయేరియా. మలేరియా. వాంతులు విరోచనాలు గురవుతామని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ ను మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు,

ఈ విషయంపై కార్యదర్శికి వివరణ కొరగా

కాసాలకు వెళ్లే మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ విషయమై పంచాయతీ కార్యదర్శి స్వప్నకు వివరణ కోరగా నా దృష్టికి వచ్చిందని వాస్తవమేనని త్వరలోనే మన బతుకులు చేయిస్తానని ఆమె అన్నారు.

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారికి జూన్ 19న హైదరాబాదులో జరిగే అభినందన సభను విజయవంతం చేయండి వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య ...

సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.



వికారాబాద్ జిల్లా ప్రభుత్వ అతిథి గృహంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు శ్యాంప్రసాద్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశనికి ముఖ్య అతిథిగా వికలాంగుల హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25న కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగ గారి సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించిన విషయం తెలిసినదే కాబట్టి పద్మశ్రీ అవార్డు పొందిన తొలిసారిగా హైదరాబాదులో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు గ్రామ గ్రామాన ఉన్న వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని అభినందన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, జిల్లా నాయకులు బంటు వెంకటయ్య, విట్టల్, రమణాచారి, సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్ లాల్ రెడ్డి, లాల్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, ఉద్యోగుల విభాగం జిల్లా అధ్యక్షులు నర్సింలు, ప్రధాన కార్యదర్శి గౌసుద్దీన్, ఎమ్మార్పీఎస్ మహిళా విభాగ నాయకులు పుష్ప రాణి , సునీత , మహేశ్వరి , చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ కమిషనర్ జన్మదిన వేడుకలు...













**సత్యమేవ జయతే , జూన్ 12, కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** జీహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ సర్కిల్- 25 డిప్యూటీ కమిషనర్ వడ్డేపల్లి నరసింహ్మా జన్మదిన వేడుకలు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. కార్యాలయ సిబ్బంది డిప్యూటీ కమిషనర్ జన్మదిన వేడుకల సందర్భంగా కార్యాలయ సమావేశ మందిరాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. కమిషనర్ నరసింహ కి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి పూల మొక్కలు, బొకేలను అందించి అందరి సమక్షంలో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ నరసింహ మాట్లాడుతూ.. కార్యాలయ సిబ్బంది ఎంతో ఆప్యాయంగా తన జన్మదిన వేడుకలను నిర్వహించి శుభాకాంక్షలు తెలపడం సంతోషంగా ఉందన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్ మహిపాల్.



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. ఎస్సీ ఎస్టీ కేసును నీరుగార్చి,అగ్రకుల పెత్తందారులకు వత్తాసు పలుకుతున్న తాండూర్ డిఎస్పి పై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే సస్పెండ్ చేయాలనీ, కొడంగల్ పర్సాపూర్ దళితుల భూములలో బలవంతంగా రోడ్ వేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని.గురువారం కేవీపీస్,సీఐటీయూ, వ్యవసాయ కార్మిక, రైతు సంఘం,ఎస్ సి ఎస్ టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం,అంబేద్కర్ సంఘం,దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్ పి గారికి వినతిపత్రం ఇచ్చిన ,సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాపోల్ మహిపాల్,ఉపాధ్యక్షులు శ్రీనివాస్,బుస్సా చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు.బుగ్గప్ప,ఎం.వెంకటయ్య,(కేవీపీస్)కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు ర్. నవీన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య,ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం కొత్తూరు చంద్రయ్య,కొడంగల్ అంబేద్కర్ సంఘం యు.రమేష్ బాబు మాట్లాడుతూ బెల్కటూర్ గ్రామ నిందితులని అరెస్ట్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ,దళితుల పక్షాన నిలబడి పోరాడుతున్న దళిత ప్రజాసంఘాల నాయకుల పై అక్రమ కేసులు పెట్టడం చాలా సిగ్గు సేటు అని,వెంటనే అక్రమ కేసులు ఎత్తి వేయాలని, కొడంగల్ పర్సాపూర్ గ్రామాలో దళితుల భూములలో అక్రమంగా రోడ్ వేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం న్ని డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారి సొంత గ్రామం బెల్కటూరు దళితులకు ఆలయ ప్రవేశం లేకపోవడం,దళితులు పెళ్లి చేసుకొని భారత్ నిర్వహిస్తున్న సమయంలో అగ్రకులాస్తులు అడ్డుకోవడం చాలా దుర్మార్గమని హెచ్చరించారు.తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సొంత జిల్లాలోనె,కుల వివక్ష అంటరానితనం,దళితులపై దాడులు జరగడం సిగ్గు చేటు అని ఇప్పటికైనా తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు జిల్లా కలెక్టర్ గారికి జిల్లా ఎస్పీ గారికి ఆదేశాలు జారీ చేసి నిందితులు వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నాము.తాండూర్ మండలం,బెల్కటూరు గ్రామానికి చెందిన దళిత యువకుడు వినయ్ కుమార్ మే నెల 18 న వివాహం చేసుకొని అదే రోజు భారత్ ఊరేగింపు చేస్తున్న సందర్భంలో దళిత పెళ్లి కుమారుని పెండ్లి భరత్ ఊరేగింపు అడ్డుకొని,దళితులపై దాడి చేసిన,దళిత పెళ్లి కుమారుని పెండ్లి భరత్ ఊరేగింపు. అడ్డుకొని,దళితులపై దాడి చేసిన అగ్రకుల కులదూహంకారులు, పెత్తందార్లను వెంటనే అరెస్ట్ చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సం.ఎ రాలు అవుతున్న, మెరిసిపోతున్న తెలంగాణ అని రేవంత్ రెడ్డి ఇంకో వైపు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా మన గౌరవ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం ప్రసాద్ గారు పుట్టిన సొంత గ్రామంలో దళితులు వివాహం భరత్ ఊరేగింపు చేసుకొని దురదృష్టం ఉంది.దళితులకు రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 14 ప్రకారం,సమానత్వం,

17 ప్రకారం కువివక్ష నిషేద్ధాం,

21ప్రకారం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కులను అగ్రకుల పెత్తందార్లు కాలారాస్తున్న ప్రభుత్వం,పోలీస్ అధికారులు పట్టించుకోక పోవడం విడ్డురం అన్నారు.ఘటన జరిగి 28 రోజులు గడుస్తున్నా నేటికీ ఆ గ్రామాన్ని,జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్ పి ఆ గ్రామాన్ని సందర్శించక పోవడంపై అధికారులపై పలు అనుమానాలకు తావు ఇస్తుందన్నారు.ఆ గ్రామంలో దళితులకు నేటికీ దేవాలయ ప్రవేశం లేదు.ఆ గ్రామం లో కులవివక్ష,అంటరానితనం దళితులపై దాడులు,దౌర్జన్యం నిరంతరం కొనసాగుతున్న ఆ దళితులు ఎన్నిసార్లు సంబందిత అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,ఎస్పి ఆ గ్రామాన్ని వెంటనే సందర్శించి బాధితులను పరామర్శించి దళితులను దేవాలయం ప్రవేశం కల్పించి,నిందితులను అరెస్ట్ చెయ్యాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశార.ఇప్పటికైనా తాండూర్ డిఎస్పి గారు తక్షణమే అరెస్ట్ చేయకపోతే కేవీపీస్,దళిత,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కొడంగల్ ఇల్లు ముట్టడి చేస్తామన్నారు.ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నవీన్,అశోక్,నరేష్,కేవీపీస్ సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## భూ భారతి చట్టాన్ని అమలు చేస్తాం..





వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మి నారాయణ... సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మి నారాయణ తెలిపారు.రైతులు రెవిన్యూ సదస్సు లను ఉపయోగం చేసుకొని సమస్యలు పరిష్కారం చేసుకోవాలి అన్నారు. వికారాబాద్ మండలం గుడుపల్లి శివారెడ్డి పెట్ గ్రామాలలో భూ భారతి రెవిన్యూ సదస్సు లు జరిగాయి. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అనిత సీనియర్ అసిస్టెంట్ సురేష్ ఆర్ ఐ లు నరేష్ సంజయ్ సిబ్బంది కృష్ణ సరోజ ప్రవీణ్ సంగమేష్ సుదర్శన్ హర్ష వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా యోగశక్తి మహిమ



భక్తులను సంరక్షించ డంలో శ్రీ సాయిది ఒక విభిన్న మైన పద్ధతి. భక్తులు తన వద్ద కు రోగాలతో బాధపడుతూ వచ్చి తగ్గించమని ప్రార్ధించి నప్పుడు విభిన్నమైన పద్ధతు లలో సాయి వారికి చికిత్స చేసేవారు. కొంతమందికి ఊ దీ, తీర్ధ ప్రసాదాలను ఇవ్వ డం, మరికొంత మందికి తలపై చేయి పెట్టి లేదా రోగగ్ర స్తమైన శరీరపు భాగాన్ని తాక డం ద్వారా ఇంకొంతమందికి కలలో కనిపించి తీసుకోవల్సి న మందు తెలుపడం, కొందరి కి అపథ్యమైన ఆహారం స్వీకరించమనడం, ఇలా వివిధ రకాలుగా చికిత్స చే సి ఎన్నో ప్రాణాంతకమైన వ్యాధుల నుండి తమ భక్తులను శ్రీ సాయి రక్షించా రు. ప్రమాదకరమైన క్షయ రోగంతో బాధపడుతున్న భక్త భీమాజీ కి సాయి కలలో అతను బాధలు పడే టట్లు చేసి అతని రోగాన్ని తగ్గించారు. కలలో నరక యాతన అనుభవించిన తర్వాత జాగృత్ వ్యవస్థ లోనికి వచ్చాక అతని క్షయ రోగం మాయమైపో యింది. మరొక సందర్భంలో శిరిడీలో నివశిస్తుండ గా కాకా దీక్షిత్‌కు తీవ్రంగా జ్వరం వచ్చింది. లేవ లేకున్నాననీ, తనకు మందు ఇప్పించమని అతను శ్యామా ద్వారా శ్రీ సాయికి కబురు చేసాడు. సాయి కోపంతో "ప్రతీవారు కోరికలతో నా దగ్గరకు వచ్చే వారే! నేనేమీ వైద్యుడను కాను. అతనిని ఇంటికి వెళ్ళి పోమని చెప్పు" అని అన్నారు. "సాయీ కాకా మిమ్మ ల్నే నమ్ముకున్నాడు. ఇంత తీవ్రమైన జ్వరంతో అత నింటికి ఎలా వెళ్ళగలడు? దయచేసి అతని బాధను తగ్గించండి!" అని శ్యామా సాయిని వేడుకున్నాడు. అయినా సాయి మనసు మారలేదు. బొంబాయికి తిరిగెళ్లడానికి తనవద్ద శెలవు తీసుకోడానికి వచ్చిన దీక్షిత్‌తో సాయి "తక్షణమే ఇంటికి పో! ఎలా వచ్చిన జ్వరం అలానే పోతుంది. సీమ బాదం పప్పు, పిస్తా కలిపిన పాయసం శుభ్రంగా తిని తిరుగు. పడుకోకు" అని అన్నారు. శ్యామాను తోడు గా దీక్షిత్‌తో పంపించారు సాయి. బొంబాయి చేరేసరికి దీక్షిత్ వళ్ళు తీవ్రమైన జ్వరం తో కాలిపోతోంది. కుటుంబ సభ్యులందరూ ఆందోళన పడ్డారు. డాక్టర్లు మందులు ఇవ్వజూసారు కాని వాటిని దీక్షి త్ సున్నితంగా తిరస్కరించా డు. ఈ భౌతిక ప్రపంచంలోని డాక్టర్ల కంటే ఈ సృష్టి, స్థితి లయకారుడైన సాయిపైనే దీక్షి త్‌కు గురి. ఏ మందులు వేసు కోకుండా, సాయి చెప్పిన అప థ్యమైన ఆహారం తింటూ దీక్షి త్ హాయిగా వున్నాడు. జ్వరం దానంతట అదేపో యింది. శారీ రక రోగమే కాక అజ్ఞానమనే మానసిక రోగం కూడా తొలగాలి అందుకే బాధలను ఓర్చు కోవాలని (సబూరి) ఈ లీల ద్వారా మనకు తెలియ జేసారు. ఎటువంటి వ్యాధులు సంభవించినా సాయి సన్నిధిని శరణు వేడితే ఆ సద్గురువు అనుగ్రచహం వలన వాటంతట అవే మటుమాయమౌతాయి.

# వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి



వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందింది. దీన్ని మొదట్లో లేములవాడ, లేంబాల వాటిక అనే పేర్లతోనూ పిలిచేవారని ఇక్కడున్న శాసనాల ద్వారా తెలుస్తోంది. రాజన్న అని నోరారా పిలుచుకునే ఈ రాజరాజేశ్వరస్వామి.. ఎంతో మహిమగల దేవుడని భక్తుల విశ్వాసం. క్షేత్రచరిత్ర/ స్థలపురాణం: మాళవ ప్రభువైన రాజరాజ నరేంద్రుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పౌరాణిక ఆధారాలు చెబుతున్నాయి. వేములవాడను చాళుక్యులు రాజధానిగా చేసుకొని పాలించినట్లు చరిత్రలో ఉంది. చాళుక్య రాజులలో మొదటి రాజు వినయాదిత్య యుద్ధమల్లుడు, అతని కుమారుడు అరికేసరి, ఆ తర్వాత రెండో యుద్ధమల్లుడు వేములవాడ కేంద్రంగా రాజ్యాన్ని పాలించారు. చాళుక్య రాజుల్లో చివరివాడు.. భద్రదేవుడి కుమారుడైన మూడో అరికేసరి అని దేవస్థానంలో ఉన్న శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. ఆలయ ప్రత్యేకత: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ధర్మగుండంలో పుణ్యస్నానం చేసి కోడెమొక్కు చెల్లించడం ఈ ఆలయ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఆ తర్వాతే భక్తులు స్వామిని దర్శించుకొని ప్రధాన పూజలైన కల్యాణం, అభిషేకం, అన్నపూజ, కుంకుమ పూజ, ఆకుల పూజ, పల్లకిసేవల వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారు. భక్తుల్లో చాలామంది స్వామివారికి తమ తలనీలాలు సమర్పించి తమ ఎత్తు బంగారాన్ని(బెల్లం) స్వామికి మొక్కుగా చెల్లించి.. ఆపై దాన్ని స్వామి ప్రసాదంగా పంపిణీ చేస్తారు. ప్రతినెలా దాదాపు 10లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకొంటారని అంచనా.

ప్రధాన వేడుకలు: ఆలయంలో ఏటా మహాశివరాత్రి సందర్భంగా మూడురోజులపాటు వైభవంగా జాతర నిర్వహిస్తారు. సుమారు 5-6 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు.

ఆపై శ్రీరామనవమి సందర్భంగా జరిగే శివ కల్యాణోత్సవాలు ఈ క్షేత్రం ప్రత్యేకతల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. పదివేలమంది హిజ్రాలు, 25 వేల మంది శివపార్వతులు శ్రీరామనవమి రోజున శివుడిని పెళ్లాడతారు. అలాగే.. త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు, ముక్కోటి ఏకాదశి, దసరా నవరాత్రోత్సవాలూ ఇక్కడ విశేషంగా నిర్వహిస్తారు. మాస శివరాత్రి, ఏకాదశి రోజున స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశిపూజ, మహాలింగార్చన చేస్తారు. ఇందులో పాల్గొనే దంపతులతో పాటు కుటుంబసభ్యులను అనుమతిస్తారు. కల్యాణపూజలో పాల్గొన్న భక్తులకు 20లడ్డూలు, భోజన వసతి కల్పిస్తారు. ఆలయాన్ని ఉదయం 4 గంటలకు తెరిచి రాత్రి 10.20 గంటలకు పవళింపుసేవ అనంతరం మూసివేస్తారు.

ధర్మదర్శనం ఉచితం, ప్రత్యేక దర్శనం రూ. 20, ప్రత్యేక ప్రవేశదర్శనం రూ. 100

సాధారణ దర్శనం: ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 7.30 నుంచి 8.30 వరకు

ప్రత్యేక దర్శనం: ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7.30 వరకు. ఒక టికెట్‌పై నలుగురిని మాత్రమే అనుమతిస్తారు.

ప్రత్యేక దర్శనం టికెట్లకు పరిమితి లేదు.

దర్శ సమయాల్లో ఎలాంటి విరామం లేదు.

ప్రత్యేక దర్శనం టికెట్ల వివరాలు: ప్రత్యేక దర్శనం రూ. 20, త్వరిత దర్శనం రూ. 100 ఆలయప్రాంగణంలోని ఉప ఆలయాలు, అనంతపద్మనాభస్వామి ఆలయం, బాలా త్రిపురసుందరీదేవి ఆలయం, మహిషాసురమర్ధిని ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం. ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు లేవు. అన్ని చోట్లా ఉచిత దర్శనమే.

ఆర్జిత సేవలు.. ప్రధానపూజలు

ఆలయంలో.. తెల్లవారుజామున 4.35 గంటల నుంచి 5 గంటల వరకూ ఉచిత సర్వదర్శనం.

ధర్మదర్శనం, అభిషేకం ఉదయం 6.15 నుంచి 11.30 వరకు ఉచితంగా ఉంటుంది.

అన్నపూజ మధ్యాహ్నం 12.15 నుంచి 2 గంటల వరకు.. టికెట్ ధర రూ. 200, రూ. 600.

బిల్వార్చన, శివార్చన మధ్యాహ్నం 2.30 నుంచి 6 వరకు, టికెట్ ధర రూ.600.

ఆకుపూజ రూ. 150, మహాపూజ రూ. 100, పల్లకిసేవ రూ. 200, పెద్దసేవలు రూ. 350.

నిత్యకల్యాణం ఉదయం 10.30 నుంచి 12.30 వరకు.. టికెట్ ధర రూ. 1000.

అన్నపూజల నివేదన: ఉదయం 11.40 నుంచి మధ్యాహ్నం 12.10 వరకు.. టికెట్ ధర రూ. 200

శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకు, టికెట్ ధర రూ. 350

కుంకుమపూజ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు, టికెట్ ధర రూ. 150

మహాలింగార్చన సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 వరకు... టికెట్ ధర రూ. 1000

గండదీపార్చన ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 వరకు.. టికెట్ ధర రూ. 5

కోడెమొక్కులు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 వరకు.. టికెట్ ధర సాధారణం రూ. 100, ప్రత్యేకం రూ. 200

ఆలయంలో పూజలకు ఆన్‌లైన్ సౌకర్యం లేదు.

ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయాలైన రామాలయం, అనంతపద్మనాభస్వామి ఆలయం, బాలత్రిపురసుందరీదేవి ఆలయం, మహిషాసురమర్ధిని ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు లేవు. దేవతామూర్తుల పూజలు, టికెట్లు, పల్లకిసేవలు, పెద్దసేవలు, కల్యాణాలుఆలయంలో నిర్వహించే పూజలు నిర్వహించే సమయాలు

# జుంటుపల్లి రైతులకు న్యాయం చేయాలి

## రైతులతో కలిసి కలెక్టర్ కు ఫిర్యాదు

**రైతులకు అన్యాయం జరిగితే ఆందోళన తప్పదు - శుభప్రద్ పటేల్.**





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.

వరి కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఇష్టరాజ్యాంగ వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ తప్పుపట్టారు. రైతుల పంటలను అడ్డికి పావు శేరు లెక్కనే కొంటున్నారని మండిపడ్డారు.

తరుగు పేరుతో రైతులను మోసం చేస్తూ 41 కిలోలకు కాంట పెట్టడానికి బదులు 43 కిలోలు తీసుకోవడమే కాకుండా.. రైస్ మిల్లర్లు సైతం 50 బస్తాలు ఉన్న రైతు దగ్గర రెండు బస్తాలు, 70 బస్తాలు ఉంటే 3 బస్తాలు, 100 బస్తాలకు 5 బస్తాలు, 150 బస్తాలకు 8 బస్తాలు కట్ చేస్తూ రైతులకు తీవ్ర నష్టం చేయడం సరికాదని బిసి కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు. గురువారం జంటుపల్లి రైతులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కలిసి ఆయన రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్... అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ల లింగ్యానాయక్, జిల్లా సివిల్ సప్లై అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి వారం రోజుల్లో రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. మాది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల బాధలు కనిపించడం లేదా అన్నారు. కలెక్టర్ చెప్పిన విధంగా జంటుపల్లి రైతులకు వారం రోజుల్లో న్యాయం జరగకపోతే బిఆర్ఎస్ పార్టీ తరుపున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంటుపల్లి బాధిత రైతులు రాంచందర్ శాంతప్ప గోవెర్దన్ గౌడ్ ఎండీ సోను గోవింద్ బీ ఆర్ ఎస్ నాయకులు రవిశంకర్ సిద్ధిఖ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి..

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి,





సత్యమేవ జయతే/హత్నూర:తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు,మండల కేంద్రమైన హత్నూర గ్రామంలోని సుందరమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు, తెలంగాణ రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి రైతులకు పాడిపంటలు బాగా పండాలని ఆ దేవుని ప్రార్థించినట్లు ఆమె అన్నారు, ఈ కార్యక్రమంలో. బీ ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామ్ చందర్ రెడ్డి,.వైస్ ఎంపీపీ పండుగ లక్ష్మి రవికుమార్. నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్. నయీముద్దీన్. సంగారెడ్డి జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు. శివ శంకర్ రావు. మాజీ జెడ్పిటిసి.ఆశయ్య. పిఎసిఎస్ డైరెక్టర్. గుండ రాములు. మాజీ సర్పంచ్ మాయిని శ్రీకాంత్, ఆగమయ్య. చెక్క రవీందర్ గౌడ్. మేరాజ్. వల్లి గారి శేఖర్. నల్లోల్ల ఎల్లయ్య. సాజిద్ హుస్సేన్. సాయిలు. వివిధ గ్రామాల మాజీ సర్పంచులు.మాజీ ఎంపీటీసీలు.నాయకులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కలలో కైలాసనాథుడు కనిపిస్తే అదృష్టం కలిసొస్తుందా లేదా కష్టాలు పెరుగుతాయా?



మీకు వచ్చే కలల్లో అకస్మాత్తుగా శివ లింగాన్ని దర్శించుకున్నట్టు, శివ లింగానికి పూజ చేస్తున్నట్టు కనిపిస్తే.. ఆశ్చర్యకరమైన ఫలితాలొస్తాయి. అయితే కలలో శివ లింగం కనిపించినప్పుడు ఏం జరుగుతుంది.. దాని అర్థం ఏంటి.. శుభమా లేదా అశుభానికి సంకేతాలా.. ఇప్పుడే చూసెయ్యండి... మనలో ప్రతి ఒక్కరికీ నిద్రలోకి జారుకున్న వెంటనే కలలొస్తుంటాయి. కొందరికీ అద్భుతమైన కలలొస్తే.. మరికొందరికి పీడ కలలు వస్తుంటాయి. ఇలా వచ్చినప్పుడు నిద్ర మత్తులో నుంచి సడన్ లేస్తూ ఉంటాం. అలాంటివి నిజ జీవితంలో జరగకూడదని, దేవుడిని ప్రార్థిస్తు ఉంటారు చాలా మంది. అయితే స్వప్నశాస్త్రంలో మనకొచ్చే కలలు, వాటికి సంబంధించిన అర్థాలేంటో పూర్తిగా వివరించబడింది.

ఈ నేపథ్యంలో స్వప్నశాస్త్రం ప్రకారం, కలలో శివయ్యను చూడటం వల్ల మీ జీవితంలో పురోగతి లభిస్తుంది. అంతేకాదు మీ కోరికలు నెరవేరేందుకు శుభ సంకేతాలొస్తాయి. అంతేకాదు మీ జీవితంలో ఎదురయ్యే అడ్డంకులన్నీ సులభంగా తొలగిపోతాయి. అయితే కలలో ఎలాంటి శివ లింగాన్ని చూస్తే, ఎలాంటి ఫలితాలొస్తాయి.. కైలాసనాథుడు కలలో వివిధ రూపాలలో దర్శనమిస్తే.. వాటి అర్థాలేంటనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం...

**శివ లింగానికి పూజ చేస్తున్నట్లు..**

స్వప్నశాస్త్రం ప్రకారం, మీకు వచ్చే కలల్లో ఈశ్వరుడి విగ్రహం లేదా శివ లింగాన్ని చూడటం వల్ల శుభప్రదమైన ఫలితాలొస్తాయి. శివయ్యను కలలో ఏ రూపంలో చూసినా మీ జీవితంలో అద్భుతమైన మార్పులొస్తాయని నమ్ముతారు. శివ లింగానికి జలాభిషేకం చేయడం లేదా కలలో శివుడిని పూజిస్తున్నట్లు కనిపిస్తే.. త్వరలో మీరు ఏదైనా ముఖ్యమైన పనుల్లో శుభ ఫలితాలను పొందుతారు.

**కలలో శివయ్య శరీరం కనిపిస్తే..**

మీకొచ్చే కలల్లో మహాదేవుని శరీరం కనిపిస్తే, అది చాలా శుభప్రదంగా పరిగణించబడుతుంది. మీ వ్యక్తిగత జీవితంలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పనులు జరగనున్నాయని నమ్ముతారు. అంతేకాదు మీరు చేపట్టే ప్రతి ప్రయత్నంలోనూ విజయం సాధిస్తారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహం మీపై ఎల్లప్పుడూ ఉంటుంది.

**కలలో శివుడిని పూజ చేస్తున్నట్టు కనిపిస్తే..**

మీ కలలో శివ లింగాన్ని పూజించడాన్ని మీరు చూసినట్లయితే, మీ జీవితంలో అన్ని రకాల అడ్డంకులన్నీ తొలగిపోతాయని, త్వరలో మీకు మంచి రోజులు రాబోతున్నాయని అర్థం.

# గరుడ పురాణంలో దానధర్మాల విశేషాలు..



హిందూ మతంతో పాటు ఏ మతంలో అయినా దాన ధర్మాలు చేయడం చేయడం అనేది ఒక పుణ్య కార్యంగా పరిగణించబడుతుంది. ఎవరైతే తమ సామర్థ్యం మేరకు నిరుపేదలకు, నిస్సహాయులకు దానధర్మాలు చేస్తారో.. వారికి మరణానంతరం కూడా ఎంతో పుణ్య ఫలం లభిస్తుందని గరుడ పురాణంలో వివరించబడింది. ఈ సందర్భంగా గరుడ పురాణం ప్రకారం, దానధర్మాల ప్రాముఖ్యత ఏమిటి, గరుడ పురాణం ప్రకారం ఎవరికి దానం చేయాలి.. దాన ధర్మాలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలగనున్నాయనే ఆసక్తికరమైన విశేషాలను ఇప్పుడు తెలుసుకుందాం...

దానధర్మాలు చేయడం వల్ల పుణ్యఫలాలు పెరుగుతాయని, ఈ జన్మలోనే కాకుండా వచ్చే జన్మలోనూ మంచి ఫలాలు వస్తాయని నమ్ముతారు. గరుడ పురాణంలోని ఆచార కాండలో, నీతిసార అధ్యాయంలో, సంతోషకరమైన, సంపన్నమైన జీవితం కోసం ఏమి చేయాలనే వివరాలు ప్రస్తావించబడ్డాయి. అందులో ముఖ్యమైన విషయం దానధర్మాలు. వీటిని ఎవరైతే తమ జీవితంలో అలవర్చుకుంటారో వారికి ధనానికి అస్సలు లోటుండదని గరుడ పురాణంలో వివరించబడింది.

దానధర్మాల ప్రాముఖ్యత..

గరుడ పురాణం ప్రకారం, పేదవారు ఎప్పటికీ దాన ధర్మాలు చేయకూడదు. పేదవారిగా ఉన్నప్పుడు దానం చేయడం వల్ల మరింత పేదలుగా మారొచ్చు. కాబట్టి పేరు ప్రతిష్టల కోసం దానధర్మాలు చేయడం మానుకోండి. అయితే ఎవరు దానం చేయాలంటే.. ఒక వ్యక్తి తాను సంపాదించిన సొమ్ము లేదా ఆస్తిలో పదో వంతు అంటే పది శాతం వరకు దానం చేయాలని శాస్త్రాల్లో వివరించబడింది. ఎవరికైతే అవసరం ఉంటుందో వారికే దానం చేయాలి. అప్పుడే మీరు చేసిన దానానికి తగిన ఫలితాలు లభిస్తాయి.

# దయాపరుడు

**విక్రమార్క చక్రవర్తి అనంతరం ఆయన కుమారుడు కీర్తికేతుడు రాజ్యానికి వచ్చాడు. తండ్రిలా కాకుండా దయాహీనుడై ప్రజలపై ఎన్నో పన్నులు విధించాడు. తన కొడుకైన విజయ భాస్కరుడు పేదలకు దానధర్మాలు చేయడం తట్టుకోలేక కొడుకుతోపాటు భార్యకు కూడా మరణశిక్ష విధించాడు కీర్తికేతుడు. అదృష్టవశాత్తూ మరణం నుంచి తప్పించుకున్న విజయభాస్కరుడు.. దొంగలు ఓ ఆడపిల్లను కాళికాదేవికి బలివ్వడానికి తీసుకురావడం చూశాడు. వెంటనే, ఆ విగ్రహాన్ని నరికేయడానికి కత్తి ఎత్తాడు. "మాతా! నువ్వు మూడులోకాలకూ పూజ్యురాలవు. అటువంటి నిన్ను నేను రక్షించడమేమిటి? నువ్వే మమ్మల్ని చల్లగా చూడాలి. ఇకనుంచి బలులు స్వీకరించనని మాటిచ్చావు. నాకంతే చాలు" అంటూ అమ్మవారికి నమస్కరించాడు విజయభాస్కరుడు. పక్కనే కట్టిపడేసి ఉన్న అమ్మాయిని తీసుకుని అక్కడినుంచి బయటికి వచ్చేశాడు. కొడుకు తీసుకువచ్చిన అమ్మాయితో అనునయంగా మాట్లాడి వివరాలు రాబట్టింది మహారాణి చారుమతీదేవి. ఆ అమ్మాయి పేరు కలభాషిణి. చంద్రగుప్త మహారాజు కూతురు. వాళ్లది చంద్రప్రస్థ నగరం అని తెలుసుకుని, ఆమెను తన తల్లిదండ్రులకు అప్పగించాలనే సంకల్పంతో.. తల్లీ కొడుకులిద్దరూ చంద్రప్రస్థానికి బయల్దేరారు. కొద్దిరోజుల ప్రయాణం తరువాత ఒకనాటి సాయంత్రం వేళకు నగరానికి కొద్దిదూరంలోని ఒక గ్రామానికి చేరుకున్నారు.**



అక్కడ ఒక నిరుపేద బ్రాహ్మణుని ఇంట్లో ఆ రాత్రికి వాళ్లు ముగ్గురూ బస చేశారు. భోజనాలయ్యాక మాటలమధ్యలో ఆ బ్రాహ్మణ దంపతుల దీనగాథ విని, విజయభాస్కరుడు నిలువునా కరిగిపోయాడు. కానీ, వాళ్లకు ఎలా సాయం చేయాలో తోచలేదు.
మరునాడు వీధి అరుగుమీద కూర్చుని ఉండగా విజయభాస్కరునికి ఒక దండోరా వినిపించింది.
"అందరూ వినండహో.. పదిరోజుల కిందట కోటలో దొంగలు పడ్డారు. సొమ్ముతోపాటు యువరాణి వారిని కూడా ఎత్తుకుపోయారు. యువరాణిని తెచ్చి అప్పగించిన వారికి అర్ధరాజ్యంతోపాటుగా, ఆమెనిచ్చి పెళ్లి చేస్తామని రాజుగారు ప్రకటించారహో!"..
అది విన్న విజయభాస్కరుడు ఓ నిర్ణయానికి వచ్చి.. "చాటింపు విన్నారు కదా! ఆ అమ్మాయే యువరాణి కలభాషిణి. ఆమెను తీసుకువెళ్లి రాజుగారికి అప్పగించమని మీ అబ్బాయితో చెప్పండి. మీకు అర్ధరాజ్యం దక్కుతుంది. మీ దారిద్ర్యం తొలగిపోతుంది" అన్నాడు విజయభాస్కరుడు.. ఆ ఇంటి యజమానితో.అతడి మంచిమనసుకు తన కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియక రెండు చేతులూ జోడించాడు బ్రాహ్మణుడు. తన కుమారుడైన నిగమశర్మను పిలిచి, సంగతి సందర్భాలు వివరించి చెప్పాడు. విజయభాస్కరుడు ఇచ్చిన కత్తిని చేతబట్టుకుని, యువరాణిని తీసుకుని కోటకు వెళ్లాడు నిగమశర్మ.
మహారాజుకు యువరాణిని అప్పగించాడు. ఆయన ఆనందం పట్టలేక నిగమశర్మను కౌగిలించుకుని..
"అయ్యా! మీరెవరు? మా అమ్మాయిని మీరెక్కడ చూశారు?! దొంగలేమయ్యారు?! వాళ్లు దోచుకున్న సొమ్ములు దొరికాయా?" అని ప్రశ్నించాడు."మహారాజా! మాది ఈ పట్టణమే! ఇటీవల నేను ఉత్తరదేశ యాత్రలు చేసి, అడవి మార్గం నుంచి తిరిగి వస్తున్నాను. ఓ పదిమంది దొంగలు ఈ అమ్మాయిని ఎత్తుకుని వెళుతుంటే నా కత్తితో ఎదిరించాను. దెబ్బకు వాళ్లు పారిపోయారు" అని సమాధానం ఇచ్చాడు నిగమశర్మ.
"బ్రాహ్మణుల్లా ఉన్నారు. మీకు సాము చేయడం తెలుసా? కదురు తిప్పగలరా?!" అడిగాడు మహారాజు.
"జంధ్యాలు వడుకుతాను కనుక, కదురు తిప్పగలను. సాము గరిడీలు తెలియవు" అని అమాయకంగా చెప్పాడు నిగమశర్మ.
అతడివంక జాలిగా చూసి.. "జంధ్యాలు వడికే కదురు కాదు స్వామీ! కత్తితో కదురు తిప్పగలరా!? ఏదీ ఆ కత్తి ఓసారిలా ఇవ్వండి" అని అడిగి తీసుకున్నాడు చంద్రగుప్తుడు.
దానిపై 'విక్రమార్క చక్రవర్తి' అన్న పేరు చూసిన తరువాత, ఏదో మోసం జరుగుతున్నదనే అనుమానం అతనిలో బలపడింది. ఆలోచనలో పడ్డాడు.
ఇంతలో నిగమశర్మ కొద్దిగా హడావుడి చేస్తూ.. "మీ కుమార్తెను తెచ్చి ఇచ్చినవారికి అర్ధరాజ్యం, ఆమెనిచ్చి వివాహం జరిపిస్తామన్నారు. తొందరగా పెళ్లి ముహూర్తం పెట్టించండి" అన్నాడు దర్పంగా.
మహారాజు అతడి తీరుకు చిరాకుపడ్డాడు.
"ప్రస్తుతానికి ఈ వెయ్యి వరహాలూ పట్టుకుపో! పెళ్లి సంగతి తరువాత చూద్దాం" అని అతణ్ని పంపించి వేశాడు. కుమార్తె వద్దకు వెళ్లి..
"నిన్ను కాపాడిన వాళ్లెవరమ్మా? ఇప్పుడు వచ్చిన అబ్బాయేనా?!" అని ఆరా తీశాడు."కాదు నాన్నగారూ!" అంటూ ఆమె జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించింది.వెంటనే సైన్యాన్ని వెంటబెట్టుకుని నిగమశర్మ ఇంటికి వెళ్లాడు చంద్రగుప్తుడు. అక్కడ విజయభాస్కరుణ్ని చూస్తూనే.. 'నా కూతురు చెప్పిన వీరుడు ఇతడే అయి ఉంటాడు' అని ఊహించగలిగాడు. కానీ, నిగమశర్మ కుటుంబానికి సాయం చేయాలని తీర్మానించుకున్నందువల్ల, విజయ భాస్కరుడు తన ఉనికిని దాచిపెట్టాడు.తానో బాటసారిని మాత్రమేనని చెప్పాడు. చేసేది లేక చంద్రగుప్తుడు తిరిగి వెళ్లిపోయాడు. విజయభాస్కరుడు వెంటనే తల్లిని తీసుకుని అక్కడినుంచి నిష్క్రమించాడు.కొన్నిరోజుల ప్రయాణం తరువాత చిత్రకూటమనే అగ్రహారానికి చేరుకున్నాడు. అక్కడ ధనవంతుల ఇళ్లన్నీ విడిచిపెట్టి ఒకానొక పేదగృహాన్ని ఎంపిక చేసుకున్నాడు. గుమ్మం ముందు నిలబడి ఇంట్లో వారిని పిలిచాడు.
యజమానురాలు బయటికి వచ్చింది.
"అమ్మా! మేము పరదేశీయులం. ఈమె మా తల్లి. చాలాదూరం నడిచి రావడం వల్ల అలిసిపోయింది. ఈ పూటకు మీ ఇంట్లో ఆతిథ్యం ఇవ్వగలరా?" అని అడిగాడు విజయభాస్కరుడు.
అందుకామె.. "ఎంతమాట.. రండినాయనా!" అని ఆహ్వానించింది.
చారుమతి లోపలికి వెళ్లింది. విజయభాస్కరుడు స్నానానికి బయల్దేరుతుండగా.. ఆ ఇల్లాలు తన ఆఖరు కొడుకైన గుణసాగరుడిని తోడు పంపించింది. స్నానం చేస్తున్నంతసేపూ గుణసాగరుడు చెప్పిన మాటల్లో విజయ భాస్కరునికి కొన్ని సంగతులు తెలిశాయి.
ఒకప్పుడు విక్రమార్క మహారాజు దేశాటన చేస్తూ ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఒక విప్రుని ఇంట్లో బసచేశాడు. ఆయన చేసిన ఉపచారాలకు సంతోషించి, ఈ అగ్రహారాన్ని రాసిచ్చాడు. క్రమంగా అగ్రహారం పెరిగి పెద్దదైంది. ఇక్కడివారంతా మహాపండితులు, ధనవంతులయ్యారు. ఒక్క గుణసాగరుని కుటుంబమే ఆర్థికంగా వెనుకబడింది. అతనికి ఏడుగురు అన్నలున్నారు. వారంతా కొద్దోగొప్పో చదువుకున్నారు. సంపాదన కోసం దేశాటన చేస్తున్నారు. ఇతనికి మాత్రం చదువు అబ్బలేదు.. ఇంతవరకూ విషయాలన్నీ చెప్పిన తరువాత.. "అన్నా! నన్నూ మీతోపాటు రానివ్వండి. ఏదో పని చేసుకుని బతుకుతాను" అని కోరాడు గుణసాగరుడు.
ఆ మాటలు విని విజయభాస్కరునికి చాలా జాలివేసింది. కానీ, తనకే ఏ దిక్కూ లేనప్పుడు మరొకరిని ఎలా పోషించగలడు?! అందుకనే మిన్నకుండిపోయాడు. భోజనాదికాలు పూర్తయిన చాలాసేపటికి ఆ ఇంటి యజమాని దేవభట్టు వచ్చాడు. ఆయన్ని చూస్తూనే..
"ఇంత ఆలస్యం చేశారేం?!" అని అడిగిది భార్య.
అందుకు దేవభట్టు.. "ఈవేళ ఒక విశేషం చూశాను. నేను రాజవీధిలో ఒక అంగడిలో కూర్చుని ఉండగా భటులు కొందరు ఒక బంగారు విగ్రహాన్ని బండిపై పెట్టి చాటింపు వేసుకుంటూ తీసుకువెళ్లారు. ఆ వింత పూర్తిగా చూసి వచ్చేసరికి ఆలస్యం అయింది" అని ఆగాడు దేవభట్టు. "బంగారు విగ్రహాన్ని ఊరేగిస్తూ చాటింపు వేశారా.. ఏమని?!" ఆసక్తికొద్దీ అడిగింది ఇల్లాలు. అందుకు దేవశర్మ.. "ఆ సంగతి చెప్పాలంటే నీకు మొదటినుంచి కథంతా వివరంగా చెప్పాలి" అంటూ చెప్పడం మొదలు పెట్టాడు. అక్కడికి కొద్దిదూరంలో రత్నకూటమనే నగరం ఉంది. దానిని చంద్రావలోకుడనే రాజు పాలిస్తున్నాడు. ఆయనకు అనేకమంది భార్యలున్నారు. కానీ, వాళ్లలో ఏ ఒక్కరూ ఆయన మనసును గెలుచుకోలేదు. దాంతో చింతాక్రాంతుడై ఉన్న రాజు ఒకరోజు వేటకు వెళ్లారు. అడవి పందిని వేటాడుతూ దారితప్పి తన సైన్యం నుంచి దూరంగా విడిపోయాడు. ఆ కారడవిలో ఒక సుందర తటాకం ఒడ్డున వనకన్యలాంటి ఒక సుందరీమణిని చూశాడు. ఆమె దేవలోక అప్సరస అయిన మేనక కూతురు. పేరు ఇందీవరప్రభ. ఆమెను చూడగానే చంద్రావలోకుడు ప్రేమలో పడ్డాడు. కానీ, ఆమె అభ్యంతరం చెప్పింది. తన పెంపుడు తండ్రి అయిన దేవవ్రతుని అనుమతి లేనిదే పెళ్లాడలేనని చెప్పింది. అప్పుడు చంద్రావలోకుడు ఆ సిద్ధుణ్ని వెతుక్కుంటూ వెళ్లాడు. రాజులోని వినయగుణాన్ని చూసి, సిద్ధుడు మెచ్చుకున్నాడు."రాజా! క్షత్రియులకు ఆయుధం పట్టడం ధర్మమే! కానీ వాటితో మూగజీవాలను హింసించకూడదు. ఇకనుంచి వేటాడటాన్ని విడిచిపెట్టు" అన్నాడు సిద్ధుడు.రాజు అందుకు అంగీకరించాడు. సిద్ధుడు ఏం కావాలో కోరుకోమనగా, ఇందీవర ప్రభను కోరుకున్నాడు రాజు. అలా వాళ్లిద్దరికీ పాణిగ్రహణం జరిగింది. కొత్తభార్యతో కలిసి రాజధానికి తిరిగివస్తూ చంద్రావలోకుడు అడవిమార్గంలోని ఓ మర్రిచెట్టుకింద తన తొలిరేయిని గడిపాడు. ఆ మర్రిచెట్టు జ్వాలాముఖుడనే బ్రహ్మరాక్షసుడిది. రాత్రంతా ఎక్కడెక్కడో సంచరించి, తెల్లవారబోతున్నదనగా తన నివాసానికి చేరుకున్న జ్వాలాముఖుడు.. ఆ జంటను చూసి ఆగ్రహోదగ్రుడయ్యాడు. "ఎవడురా నువ్వు? నా చెట్టుకిందికి రావడానికి దేవతలు సైతం భయపడతారు. అటువంటి చోటికి నువ్వు రావడమే కాకుండా, స్త్రీతో రమించి నా ప్రదేశాన్ని అపవిత్రం చేశావు. ఇప్పుడే నిన్ను కబళిస్తాను" అని హుంకరిస్తూ ముందుకు రాబోయాడు.చంద్రావలోకుడు గజగజ వణుకుతూ.. "మహాత్మా! నీ ఇంటికి అతిథులుగా వచ్చినవారిని నువ్వే భక్షించడం ధర్మం కాదు. నేను నీ శరణుజొచ్చుతున్నాను. నన్ను రక్షించు" అని వేడుకున్నాడు.దాంతో బ్రహ్మరాక్షసుడి మనసు కరిగింది. "సరే.. నిన్ను విడిచిపెట్టేస్తాను. కానీ, ఒక పక్షం రోజులలోపు నాకో పదహారేళ్ల బ్రాహ్మణ కుమారుణ్ని బలిగా సమర్పించాలి. అతడి కాళ్లను తల్లి, చేతులను తండ్రి పట్టుకుని ఉండగా నువ్వు నీ కత్తితో తల నరికి నాకు రక్తతర్పణం చేయాలి. చెప్పిన గడువు లోపల ఈ షరతు పూర్తి చేయలేకపోయావో ఎక్కడ దాక్కున్నా నిన్ను పట్టి నీ రక్తం పీల్చి తీరుతాను" అని హెచ్చరించాడు.చంద్రావలోకుడు బతుకుజీవుడా అనుకుంటూ రాజధానికి తిరిగి వచ్చాడు. జరిగింది మంత్రులకు చెప్పాడు. "నా ప్రాణాలకోసం వేరొకరిని బలిపెట్టడమా?! అయినా కన్నకొడుకుని చంపుతుంటే దగ్గరుండి సహకరించే కఠినాత్ములు ఎక్కడైనా ఉంటారా?!" అన్నాడు చంద్రావలోకుడు విచారంగా.అందుకు మంత్రులు బాగా ఆలోచించి అతనికో ఉపాయం చెప్పారు. దానిప్రకారం చంద్రావలోకుని ఎత్తుకు సరిపడే బంగారు విగ్రహాన్ని పోతపోయించారు. దాని చేతిలో ఒక దానపత్రాన్ని ఉంచారు.'బ్రహ్మరాక్షసునికి ఎవరైతే తమ కుమారుణ్ని బలివ్వడానికి సహకరిస్తారో, వారికి ఆ బంగారు విగ్రహం కానుకగా ఇవ్వబడుతుంది' అని అందులో రాసి ఉంచారు.అని కథంతా చెప్పిన తరువాత.. "ఈవేళ ఆ విగ్రహం మన ఊరు వచ్చింది. దాన్ని చూస్తే నాకో మంచి ఊహ తోచింది. మనింట్లో పనికిమాలిన వాడొకడున్నాడు కదా! వాణ్ని బలిచ్చి, బంగారు విగ్రహం పొందితే మన దరిద్రం అంతా వదిలిపోతుంది" అన్నాడు దేవభట్టు.
"ఎవరా పనికిమాలినవాడు?!" అని అడిగిందామె.
"ఇంకెవరూ.. గుణసాగరుడే!" అన్నాడు దేవభట్టు.
ఆ మాట వింటూనే అరుగుమీద విజయభాస్కరునితోపాటు కూర్చుని అంతసేపూ తల్లిదండ్రుల మాటలు వింటున్న గుణసాగరుని గుండెలు అదిరిపోయాయి.

## శెంబు లింగాన్ని శెంబు ఏదిరా అని అడిగితే దాచిపెట్టిన బంగారాన్ని దొంగోళ్లకు సూపెట్టిండు



ఎన్కట ఒక ఊర్లె శెంబులింగం అనే ఎడ్డోడు ఉంటుండె. ఆనికేం దెల్వది. అంత పిసపిస.. నసనస. ఊర్లె అందరికి ఆడు టైంపాస్. ఈళ్ల ఊరు అడివికి పక్కన్నే ఉంటుండె.
ఎప్పటికి దొంగల భయం ఉంటుండె. అట్లనే ఒకపారి బందిపోటోల్లు ఊరు మీద వడుతండ్లని మత్లావు దెలిశింది. ఊరోల్లంత ఆల్లతాన ఉన్న బంగారం, నగలు, నాణాలు అన్ని ముల్లెలు గట్టి సావిడి కాడున్న గడ్డివాము కింద పొక్క దవ్వి అండ్ల దాశివెట్టిండ్లు. ఓనాడు రాత్రి అనుకున్నట్టె దొంగల గుంపచ్చి ఊరుమీద వడ్డది. ఇల్లిల్లు దేవులాడిండ్లు. ఏద్దొరికితె అది ముల్లె గట్టుకున్నరు.
ఎవ్వల దగ్గర ఎండి బంగారం గనవడకుంటె.. ముచ్చట ముందే దెలిశిందేమోనని ఒక్కొక్కన్ని గొట్టుకుంట అడుగవట్టిండ్లు.
శెంబులింగం దగ్గరికి రాంగనే ఆడెట్లనో అనిపిచ్చిండు. ఆని పిసపిస సూపులు, బట్టలు జూశి జరంత గమ్మతి జేద్దామని.. "నీ పేరేంది?" అంట అడిగిండొకడు. ఎంటనే.. "శెంబులింగం" అంట గట్టిగ జెప్పిండు.. ఇనంగనే అందరు పుసుక్కున నవ్విండ్లు. ఇంకింత మజాక్ జేద్దామని ఇంకోడు.. "శెంబులింగం.. గిలాసలింగం ఏందిరా?! నువ్వు శెంబులింగమైతే మరి నీ శెంబు ఏదిరా?" అంట అడిగిండు.
పేరువెట్టి 'శెంబు.. గింబు' అనంగనే మనోనికి మస్తు రేషమచ్చింది. ఎంటనే.. "నా శెంబా..! అందరు ఆల్ల బంగారం ఏడ దాశిపెట్టిండ్లో నేను గూడ నా శెంబును ఆన్నే దాశివెట్టిన" అంట జెప్పిండు. అసలు ముచ్చట ఎరుకయ్యేటాలకు, దొంగలు గడ్డివామి కింద దాశివెట్టిన ముల్లేమూటా అంత సదుర్కపోయిండ్లు. ఊరోల్లంత నెత్తినోరు గొట్టుకుంట.. "ఓరి పిస్సోడా! నువ్వు జెయ్యవట్టే మా ముల్లెలన్ని వోయినయ్" అంట తిట్టవట్టిండ్లు.
మనోడు తక్వ తిన్నడా.. "మీ ముల్లెలే వేయినట్టు ఏడుత్తాండ్లు.. నా శెంబు గూడ వోయింది" అంట లబోదిబోమన్నడు.

## బాబోయ్.. బొంబాయి టైలర్!



మా పాతింటి నుంచి ఊరి పెద్ద చెరువుకు వెళ్లే దారిలో వరమ్మ ఇల్లు ఉండేది. వరమ్మ నడివయసు దాటిన ఇల్లాలు. ఎవరి కులం ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తీ, తెలుసుకునేనైపుణ్యమూ మాకు అప్పటికీ, ఇప్పటికీ లేవు.
అప్పట్లో ఎవరినైనా కులం పేరుతోనే గుర్తించేవారు, పిలిచేవారు. అదికూడా వాళ్ల వృత్తిని బట్టే ఉండేదనుకుంటా. ఉదాహరణకు అవుసలోళ్లు, శాలోళ్లు, చాకలోళ్లు, కుమ్మరోళ్లు, కమ్మరోళ్లు, వడ్లోళ్లు, కోమట్లు, బామండ్లు.. ఇలా బాహాటంగానే మాట్లాడుకునేవారు. మా ఇంటికి కూడా.. 'గా కర్ణాల ఇంటికి బొయ్యి కల్యమాకు అడుక్కరాపో!' అనో.. 'సల్ల పొయ్యిమను పో!' అనో తమ పిల్లల్ని పంపేవారు. ఆ విధంగానే వరమ్మను ఎప్పుడూ మేర వరమ్మ అనేవాళ్లందరూ. వరమ్మ వాళ్లింట్లో ఓ పాత కుట్టుమిషిన్ ఉండేది. దాని ముందు ఓ చెక్క స్టూల్ మీద కూర్చుని బట్టలు కుడుతూ ఉండేది. పాత తెలుపు – నలుపు సినిమాల్లో తల్లులందరూ అలా కుట్టుమిషిన్లు తొక్కి.. బట్టలు కుట్టి.. తమ కొడుకుల్ని డాక్టర్ లేదా ఐఏఎస్ చదివించడమూ, కూతుళ్ల పెళ్లి చేయడమూ చూశాను. కొన్నిసార్లయితే చెట్టంత కొడుకు వచ్చి.. 'అమ్మా! నేను బియ్యే ప్యాసయ్యానమ్మా!' అని తల్లి నోట్లో స్వీట్ పెట్టబోతుంటే ఆ తల్లి వద్దని గుక్కెడు రక్తం కక్కుకుని చనిపోవడం.. 'ఎంత పని చేశావమ్మా!' అంటూ ఆ కొడుకు నోట్లో పిడికిలి కుక్కుకుని ఏడవడం కూడా చూశాను. ఆ చివరి విషయం నాకు నచ్చకపోయినా.. కుట్టుమిషిన్ అంటే నాకు చాలా క్రేజ్, గౌరవం ఉండేవి. అంత గొప్పదైన ఆ మిషిన్ ఎప్పుడైనా ఓసారి తొక్కాలని అనుకునేదాన్ని. కానీ, ఆ అవకాశం దొరికేది కాదు. మా నానమ్మ ఏ టైలర్‌నీ మెచ్చేది కాదు. ఎవరు కుట్టినా ఆ బ్లౌజ్‌కి రిపేర్ ఉండాల్సిందే! కొన్నిసార్లు తనే మళ్లీ రిపేర్ చేసుకునేది. లేకపోతే వరమ్మకు ఇచ్చేది. అలా ఇచ్చినవి తీసుకురమ్మని మమ్మల్ని పంపేది.
అదేమిటో గానీ మేము ఎప్పుడు వరమ్మ ఇంటికి వెళ్లినా.. ఆ మిషిన్ రిపేర్‌లోనే ఉండేది. బెల్ట్ తెగిపోవడమో, బాబిన్‌లో దారం చిక్కుపడటమో లేదా మిషన్ హార్డ్‌గా తిరుగుతున్నదని నూనె వేసి ఉంచడమో.. జరిగేది.
"బిడ్డా! మీరెందుకు ఒచ్చిన్రు? నేను తీస్కొచ్చి ఇస్త తియ్యి" అనేది వరమ్మ.. ఒక కంటి అద్దంలోంచి చూస్తూ. ఆ రోజుల్లో దారిద్ర్యం ఏ స్థాయిలో ఉండేదో వరమ్మను చూస్తే తెలిసేది. ఆమె కళ్లద్దాల్లో ఒక అద్దమే బాగుండేది. ఇంకో అద్దం పగిలి గీతలు పడి ఉండేది. ఫ్రేమ్ కూడా ఒక పక్క మొత్తం విరిగిపోవడంతో, దానికి ఒక సన్నని పొడవాటి బట్టపేలిక కట్టి చెవి చుట్టూ చుట్టుకుని ఉండేది. "అయ్యో! గంత పాడయింది. ఇంకోటి కొనుక్కోక పోయినవా?!" అని మేము అడిగితే.. "పైసల్ గావొద్దామ్మా?!" అనేది. మేము నిస్సహాయులం అయ్యేవాళ్లం. వాళ్లది చాలా చిన్న ఇల్లు. గోడలకు దేవుళ్ల పటాలూ, క్యాలెండర్లూ, దూలాలకు ఫొటోఫ్రేములూ వేళ్లాడుతూ ఉండేవి. అందులో ఒక ఫొటో మమ్మల్ని చాలా భయపెట్టేది. అది వాళ్ల పెద్ద కూతురిది. పక్కూరి సంబంధమే అని పెళ్లి చేస్తే.. వాళ్లు చిత్రహింసలు పెట్టేవాళ్లట. చివరికి ఆమె ఉరేసుకుని చనిపోయిందట. విషాదం ఏమిటంటే.. అప్పటివరకూ ఆమె ఒక్క ఫొటో కూడా దిగలేదట. శవ పంచనామా సమయంలో వచ్చిన ఫొటోగ్రాఫర్‌ను బతిమిలాడి.. కొన్ని డబ్బులిచ్చి ఆమెది ఒక ఫొటో తీయించి ఫ్రేమ్ కట్టించి పెట్టుకున్నారట. మెడలో ఉరితాడుతో, బయటికి పొడుచుకు వచ్చిన నాలుకతో.. భయంకరంగా ఉండేది.
ఆమె రెండో కూతురు కూడా చాలామంచిది. కానీ పెళ్లయినా వీళ్లింట్లోనే ఉండేది. కుట్టు మిషిన్ మహత్యమో ఏమో గానీ.. తరువాతి ఇద్దరు మగపిల్లల్నీ, ఇద్దరు ఆడపిల్లల్నీ బాగానే చదివించింది వరమ్మ. ఆడ పిల్లలిద్దరూ గవర్నమెంట్ టీచర్లయ్యారు. మగవాళ్లలో పెద్దాయన బొంబాయి వెళ్లి టైలర్ అయ్యాడు. అప్పట్లో బాంబే టైలర్స్ అంటే చాలా క్రేజ్ ఉండేది. ఓసారి మా నాన్న మా పుట్టిన రోజుల గౌన్ల కోసం అప్పుడే కొత్తగా వస్తున్న మంచి ప్రింటెడ్ సింథటిక్ బట్ట తెచ్చాడు. ఆ టైంలో ఈ బాంబే టైలర్ ఎందుకో వచ్చాడు. "నేను బ్రహ్మాండంగా కుడతా!" అని మా అమ్మను కన్విన్స్ చేసి తీసుకెళ్లాడు. మాకు ప్రతిరోజూ ఆ ఫ్రాకులు వేసుకున్నట్టు కలలే! పొద్దున లేవగానే వాళ్లింటికి పరిగెత్తడం.. "ఇవాళ శనివారం, నిన్న అమాశ.. కొత్తబట్టలు కుట్టొద్దు" అంటూ కారణాలు చెప్పి, అతడు పని మొదలుపెట్టకపోవడం.. చూసి నిరాశపడటం జరిగేది. చివరికి అక్క పుట్టినరోజు రేపనగా మొత్తానికి రెండు గౌన్లు కుట్టి తెచ్చాడు. అవి చూసి మేము నీరుగారి పోయాం. అక్క బాగా సన్నం, పొడవు. తనకేమో గౌను పొట్టిగా కుట్టి నడుమూ, చేతులూ కూడా కరెక్టుగా సరిపడేంతగా ఇంక ఏమాత్రం పెంచడానికి వీల్లేనట్టు కుట్టాడు. నేను కొంచెం బొద్దు. నాకు సరిపడేలాగానే కుట్టి.. చేతులు మాత్రం ఒకటి పొడవూ, ఒకటి పొట్టీ.. ఇలా కుట్టాడు. ఒకరిది ఒకరం ఎక్స్‌చేంజ్ చేసుకోలేని పరిస్థితి. మేము గునుస్తుంటే అమ్మ.. "పోనీలే! నేను సరిజేస్త తియ్యండి" అని మమ్మల్ని ఓదార్చింది. అమ్మ జాకెట్లు అమ్మే చేతితో కుట్టుకునేది.
"ఇంతకూ బొంబాయిల నువ్ ఏం జేస్తవయ్యా?!" అని నాన్న అడిగితే.. "అక్కడ బట్టలు అందిస్త! మడుతబెడ్త. అయిన భీ రోజు జూస్త గద! మంచిగనే కుడ్త గనీ, గీడ మా అమ్మ మిషిని మంచిగలేదు" అన్నాడట. అట్లా అయ్యింది మా బొంబాయి టైలర్ పని.

# పర్యాటక పండుగలు



**పండుగలంటే దసరా, దీపావళిలే కాదు.. పండుగలంటే చాలా పండుగలున్నాయి. సాంప్రదాయ పండుగలు కొన్ని సాంస్కృతిక పండుగలు ఇంకొన్ని, పర్యావరణ పండుగలు కొన్నయితే, సాహిత్య పండుగలు ఇంకొన్ని.. ఇలాగే పర్యాటక పండుగలు కూడా జరుగుతాయి. మనకు తెలియని ఆ పండుగలేంటో చూద్దామా..భారతదేశవ్యాప్తంగా నిత్యం ఏదో ఒక సాంస్కృతిక సంగీత పండుగలు జరుగుతూనే ఉంటాయి. కొన్ని మతాలకు సంబంధించినవి అయితే ఇంకొన్ని కులాకు సంబంధించినవి. కొన్ని ప్రాంతాలకు సంబంధించినవి అయితే మరిన్ని వైవిధ్యాలకు సంబంధించినవి. అయితే ఈ ఉత్సవాలు ఉత్సాహాన్ని ఇచ్చేవిగా ఉంటాయి. అందుకోసం విదేశాల నుంచి కూడా వస్తుంటారు. సీజన్లను బట్టి రంగురంగుల అలంకరణలు చేసుకొని ఆకర్షిస్తుంటాయి. ప్రయాణాలను వివరించాలంటే, విశ్లేషించాలంటే అవి చేసి ఉండాలి. ప్రయాణాలు చేసేవాళ్లు తమ జీవితాన్ని సునాయసంగా బతికేస్తారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. మానవ జీవితంలో ప్రయాణమనేది అతి ఉత్తేరపరిచే అంశంగా కూడా పలువురు అభిప్రాయపడ్డారు.**



**దుంగరి మేళ, మనాలి**

భూతల స్వర్గంగా పిలిచే మనాలిలో ఏడాది మొత్తం ఏదో ఒక ఉత్సవం జరుగుతూనే ఉంటుంది. అక్కడ నిత్యం పర్యాటకుల రద్దీతో పండుగ వాతావరణం కనిపిస్తూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా మనాలీలో జరిగే దుంగరి మేళలో సంస్కృతి సంప్రదాయాలు వెల్లివిరుస్తాయి. మంచుకురుస్తుంటే కొండప్రాంతాల్లో ఉండే ప్రజలు అంతా ఏకమై జరిపే ఈ పండుగకు అతిథులు వేల సంఖ్యలో వస్తుంటారు. దుంగరి అడవిలో ఉండే హదింబా అమ్మవారి జాతరకు పర్యాటకులు కిక్కిరిసిపోతారు.



**కొట్టియూర్ ఉత్సవం, కేరళ**

అందమైన అటవీప్రాంతంలో ప్రయాణం చేస్తుంటే రోడ్ల పక్కల ఏనుగులు, జింకలు పరుగెడుతుంటాయి. దట్టమైన అడవిలో ఉండే ప్రశాంతమైన వాతావరణంలో ఒక్కసారిగా గుడిగంటలు మోగుతుంటే భక్తి పారవశ్యంలో మునిగిపోతారు అక్కడికి వెళ్లిన వాళ్లు. బెంగళూరు, మైసూర్ నుంచి వెళ్లే సందర్శకులు ఎక్కువ కనిపిస్తారు. వైశాఖ మహోత్సవంగా పిలువబడే ఈ పండుగ మే నుంచి జూన్ మధ్య కాలం వరకు జరుగుతుంది. సమ్మర్ హాలీడేస్‌లో వెళ్లేవాళ్లు కొట్టియూర్ ఉత్సవాలకు వెళ్తే మరిచిపోలేని మధురానుభూతిని పొందుతారు.



**సమ్మర్ ఫెస్టివల్, ఊటి**

మంచు కొండల మధ్య జరిగే ఊటి సమ్మర్ ఫెస్టివల్ ఎవర్‌గ్రీన్ ప్రకృతి పండుగ. విదేశీయులు, ఊటి చుట్టుపక్కల ఉండే అడవిబిడ్డలు ఈ పండుగలో ఎక్కువ పాల్గొంటారు. అడవుల్లో పండించిన పంటలను అక్కడ అమ్మకానికి ఉంచుతారు. ప్రకృతి ఇచ్చే అరుదైన జాతి పండ్లు, కాయలు, మొక్కలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచుతారు. మే నెల మొత్తం జరిగే ఈ సమ్మర్ ఫెస్టివల్‌లో రోజూ ఏదో ఒక కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది.



**పోలో ఫెస్టివల్,లడఖ్**

ఇదొక క్రీడా ఉత్సవం. జూలై 11న ప్రారంభం అయి 17న ముగుస్తుంది. ఆరవ లడఖ్ పోలో ఫెస్టివల్‌లో ఈసారి గుర్రపు పందాలతో పాటు జానపద నృత్య సంగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, ఆర్చరీ వంటి పోటీలను నిర్వహించనున్నారు. చుట్టూ మంచు పర్వతాలు మధ్యలో ఉన్న చుసోత్ గ్రామంలో ఈ క్రీడా పండుగ జరుగనున్నది. మైనస్ డిగ్రీల చలిలో గుర్రాలు పరుగెడుతుంటాయి.



**సాగ దావ, సిక్కిం**

టిబెటియన్ క్యాలెండర్ ప్రకారం నాలుగో నెలలో జరిగే ఈ ప్రకృతి ఉత్సవం ఘనంగా జరుగుతుంది. జూన్ 17న ప్రారంభం కానున్న సాగ దావ ఉత్సవాలను సర్వం సిద్ధం చేస్తున్నారు నిర్వాహకులు. సాఖ్యముని పుట్టిన సందర్భంగా ఈ పండుగను జరుపుతారు. ఈ నెలలో మాంసం తినకుండా జంతువులను చంపకుండా నిష్ఠతో పవిత్రంగా ఉంటారు. కొందరు పావురాలను గాల్లోకి ఎగురవేసి శాంతిని కోరుతారు. ఈ నెలలో ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తే పాపాలన్నీ పోతాయని వారి నమ్మకం. మొక్కులు ఉన్నవారు రంగు రంగుల బట్టలతో తయారు చేసిన జెండాలను కడతారు.

**సమ్మర్ ఫెస్టివల్, షిమ్లా**

వేసవిలో విరామం కోరుకునే వాళ్లు షిమ్లాకు వెళ్లి తీరాలి. ఎండాకాలంలో అక్కడ జరిగే పలు ఉత్సవాలు దేశం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులు ఇక్కడ సేదతీరుతారు. 19వ శతాబ్దం నాటి చర్చిలను చూసి ఇక్కడి ప్రకృతిని ఆస్వాదిస్తారు. ముఖ్యంగా షిమ్లాలో సమ్మర్ ఫెస్టివల్‌లో ప్రదర్శించే ఆహారం ఇంకెక్కడా లభించదు. షిమ్లాలో ఉండే కట్టడాలు, ఎత్తైన కొండలు, జలపాతాలు, ఆలయాలను సందర్శించాలంటే ఒక్కరోజు చాలదు. కేవలం షిమ్లా కాకుండా చుట్టు పక్కల ఉండే దర్శనీయ ప్రాంతాలకు కూడా వెళ్లాల్సి ఉంటుంది.

# ప్రకృతిని వీక్షిసూ..అనుభూతిని ఆస్వాదిస్తూ

**రైలు ప్రయాణమంటే తొందరగా, సురక్షితంగా గమ్యానికి చేర్చే మార్గం ఒక్కటే కాదు. దూర ప్రయాణాలను దగ్గరే చేసే మార్గం అంతకన్నా కాదు. ప్రయాణం చేస్తూ ప్రకృతిని వీక్షిస్తూ అనుభూతిని ఆస్వాదిస్తూ ఈ రైలు మార్గాల గురించి చదివేయండి. క్షణాలు నిమిషాలుగా, నిమిషాలు గంటలుగా, గంటలు రోజులుగా, రోజులు నెలలుగా క్యాలెండర్లు మారుతున్నాయి. కన్నుమూసి తెరిచేలోపు గడిచిపోవాల్సినవి గడిచిపోయి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. మనం గడిపిన క్షణాలు గొప్పగా ఉండాలంటే ప్రయాణాలు చేయాలి. గొప్ప ప్రయాణాలు గొప్ప జ్ఞాపకాలను ఇస్తాయి. ప్రయాణాలను, ప్రకృతిని ఇష్టపడే వాళ్లు జీవితంలో ఒక్కసారైనా ఇలాంటి రైలు ప్రయాణం చేయాలి. ప్రపంచంలో ఉన్న అత్యద్భుతమైన రైలు ప్రయాణాలివి..**



**గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్**

జెర్మాట్, సెయింట్ మోరిట్జ్ ప్రాంతాలను కలుపుతూ స్విట్జర్లాండ్‌లో నిర్మించిన అత్యంత అందమైన రైలు వంతెన మార్గమిది. దీనికి గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్ వే అని పేరు పెట్టారు. ఈ దృశ్యాన్ని చూడడం కంటే వెళ్లి అక్కడ ప్రయాణిస్తే బాగుంటుంది. ఈ దారి గుండా ప్రయాణిస్తే 91 సొరంగాలుంటాయి. 291 వంతెనలుంటాయి. గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ఈ వంతెన సముద్ర మట్టానికి 6706 ఫీట్ల ఎత్తు ఉంటుంది. ఆరు పిల్లర్లు కలిగిన ఈ వంతెన చూడగానే ఆకర్షిస్తుంది.



**ది హాన్**

ప్రపంచంలో ఎక్కడా చూడని ప్రకృతి అందాలు ఈ ప్రయాణంలో చూడొచ్చు. ఆస్ట్రేలియాలోని ది హాన్ ట్రావెల్స్ నుంచి డార్విన్, ఆడిలైడ్ వరకు ప్రయాణించవచ్చు. ఇది సుమారు రెండు వేల కిలోమీటర్ల దూరం ఉంటుంది. సారవంతమైన ఎర్రనేలల మీద కనుచూపు మేర ఉండే మైదానాలలో నుంచి ఈ ప్రయాణం సాగుతుంది.

**ఫస్ట్ ప్యాసేజ్**

పర్వాతారోహకులు ఎక్కువగా వెళ్లే మార్గమిది. ఫస్ట్ ప్యాసేజ్ ఆఫ్ వెస్ట్ అని ఈ మార్గాన్ని పిలుస్తారు. ఎత్తైన పర్వతాలు, చుట్టూ పొగమంచు, కనుచూపు మేర కనిపించే అందమైన ప్రకృతి అందాల నెలవిది. సౌత్ బ్రిటిష్ కొలంబియా వాంకోవర్ మధ్య ఉన్న ఈ రైలు మార్గం అత్యంత సుందరమైన రైలు మార్గాలలో ఒకటి. నగరాలు, గ్రామాలతో సంబంధం లేకుండా దట్టమైన అడవుల మధ్య నుంచి రైలు వెళ్తుంది. మధ్యలో కనిపించే సరస్సులు, చీకట్లో తారసపడే నగరాలు ఊహకు అందని అనుభవాన్నిస్తాయి.

**ట్రాన్స్- సైబీరియన్**

ప్రపంచంలోనే అతి పొడవైన రైలు మార్గాల్లో ఇది ఒకటి. రష్యా రాజధాని మాస్కో పశ్చిమాన ఉనన టెర్మినస్ వద్ద ప్రారంభమై, ట్రాన్స్ – సైబీరియరన్ ఉరల్ పర్వతాలపై నుంచి సైబీరియన్ అడవులను దాటుతూ వెళ్లాల్సి ప్రయాణమిది. ఇది రష్యా మొత్తం విస్తరించి ఉంటుంది. ప్రారంభమైన చోటు నుంచి గమ్యానికి చేరడానికి ఎనిమిది రోజులు పడుతుంది. ప్రపంచంలో అతిపెద్ద మంచి నీటి సరస్సు అయిన బైకాల్ మీది నుంచి ఈ కూడా ప్రయాణం సాగుతుంది.



**ట్రాన్స్ ఆల్ఫైన్**

న్యూజీలాండ్‌లని సౌత్ ఐలాండ్స్, క్రైస్టర్చ్ నుంచి ట్రాన్స్ ఆల్ఫైన్‌ల వరకు వెళ్లే రైలు ప్రయాణం అరణ్యాల మీదుగా వెళ్తుంది. ఉష్ణమండలాలు, వర్షారణ్యాలనుకూడా చూడొచ్చు. స్కాట్లాండ్‌లోని అతిపెద్ద నగరమైన గ్లాస్గో పట్టణంలో ఉన్న రైలు మార్గం ప్రయాణీకులను ఆకట్టుకుంటుంది. మరిచిపోలేని మధురానుభూతుల్ని మిగుల్చుతుంది. హ్యారీపోర్టర్, పలు వెబ్‌సిరీస్‌లలో ఈ లొకేషన్లను ఎక్కువ చూపించారు. ఇక సౌతాఫ్రికాలోని నమీబియా సఫారీ రైలు ప్రయాణం గురించి వర్ణించలేము. రెండు వేల కిలోమీటర్లు దట్టమైన అడవుల్లో , చుట్టుపక్కల జట్టువులు, నీటి కొలనులతో దర్శనమిస్తుంది. నదులు, జలపాతాలను దాటుకుంటూ వెళ్లే ఈ ప్రయాణం బాగుంటుంది. ఇలాంటివి మొత్తం ప్రపంచవ్యాప్తంగా పదకొండు ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా ఇలాంటి ప్రయాణాలు చేసి ఆ అనుభూతిని పొందాలి.

